


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 27.08.2025 | సంపుటి : 2 | సంచిక :205 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Wednesday | 27.08.2025 | volume : 2 | Issue : 205 | Pages : 8 | Cost : 2/- |



'రాజముద్ర'
పాఠకులకు
ప్రకటన కర్తలకు
పాత్రికేయులకు
శ్రేయోభిలాషులకు
వినాయక
చతుర్థి
శుభాకాంక్షలు

- ఓటర్ల జాబితా విడుదలకు ఈసీ నోటిఫికేషన్
- 28లోపు ముసాయిదా జాబితా ప్రకటన




# స్థానిక ఎన్నికలపై కసరత్తు

**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిపై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లోని ఫోటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

03

# భారత ఎగుమతులపై 50శాతం సుంకాలు

- నేటి నుంచే అమల్లోకి రానున్న ట్రంప్ ఆదేశాలు
- సవాళ్లకు సిద్ధంగా ఉన్నామన్న ఆర్‌బిఐ

భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ సర్కార్.. రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్‌పై మరో 25 శాతం టారీఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఆగస్టు 6న ఈ ఎగ్జిటీవ్ ఆర్డర్‌పై 14329పై సంతకం చేసిన ట్రంప్..ఈ నెల 27 నుంచి 50 శాతం టారీఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.



03



03

ఫోక్సో కేసులో

## నల్లగొండ కోర్టు సంచలన తీర్పు

హత్యాచార నిందితుడికి 51 ఏళ్ల జైలుశిక్ష



07

టారిఫ్‌ల ముందు

## మార్కెట్లు ధమాల్..

దేశీయ మార్కెట్లు భారీగా పతనం



02

## గవర్నర్లకు విచక్షణాధికారం

- ఆర్థిక బిల్లులను కూడా అడ్డుకోవచ్చు
- ఇది సమస్యాత్మ అంశమని సుప్రీం అభిప్రాయం

# 30 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

కాళేశ్వరం కమిషన్‌పై చర్చించే అవకాశం

తొలిరోజు సభ అనంతరం.. మంత్రివర్గ భేటీ

బీసీ రిజర్వేషన్ల జీఓ జారీపై చర్చ




**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అంతకు ముందు రోజు అంటే 29వ తేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అలాగే బిసి రిజర్వేషన్లపై ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపై మరోమారు చర్చించే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు- తెలుస్తోంది. ఈ సమావేశాల్లోనే సభ్యులందరికీ కమిషన్ రిపోర్ట్‌ను ప్రభుత్వం అందించనుంది. కాగా, అసెంబ్లీ సమావేశాలు 5 రోజుల పాటు- నిర్వహించే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. అయితే దీనిపై అధికార ప్రకటన వెలువడాల్సి ఉంది.

03



ఎలక్ట్రిక్ వాహనరంగంలోకి

# మారుతి కారు

## 100 దేశాలకు ఎగుమతి లక్ష్యం..

మారుతీ సుజుకీ ఈవీ కారును ప్రారంభించిన మోదీ

దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఈక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌లోని హన్సల్‌పుర్ మారుతీసుజుకీ మోటార్ ప్లాంట్‌లో రెండు కీలక ప్రాజెక్టులు ప్రారంభించారు. మారుతీ సుజుకీ తొలికారు ఇ-విటారాతో పాటు హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ ఉత్పత్తి చేసే తొలి ప్లాంట్‌కు జెండా ఊపారు.

07




02

మారుమూల ప్రాంతాలకూ

## న్యాయసేవలు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్
- సైనికుల కోసం ఎనిమిది జిల్లాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ప్రారంభం




02

## సీఎం రేవంత్ రెడ్డిది బజారు భాష

- ప్రజలను మభ్య పెట్టేందుకు ఎత్తులు
- మండిపడ్డ బిఆర్‌ఎస్ నేతలు మధుసూధనాచారి, జోగు



కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే..

# రాజకీయ సన్యాసం

- ఓట్ చోరీ అంటూ ప్రజలను అవమానిస్తున్న కాంగ్రెస్
- ఓట్ చోరీ జరిగితే బిజెపి 16 సీట్లు గెలిచేది
- మాది నిజంగానే దేవుళ్ల పార్టీ
- కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

03

కాంగ్రెస్ మళ్లీ అధికా రంలోకి వస్తే.. రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాగ్దానాలు అమలుకాలే దని, మోసపూరిత హామీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెప్పాలని బండి సవాల్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించిన సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు.

# బీహార్‌లో రాహుల్ ఓటర్ అధికార యాత్ర

పాల్గొన్న సిఎం రేవంత్, డిప్యూటి భట్టి, మంత్రులు




02

**పాట్నా, ఆగస్ట్ 26 :** బీహార్‌లో ఓటర్ అధికార యాత్ర తిరిగి ప్రారంభమైంది. మంగళవారం బీహార్ లోని సుపాల్ లో సాగుతున్న ఓటర్ అధికార్ యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కలసి ప్రియాంకగాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఆర్జేడీనేత తేజస్వి యాదవ్, ఇండియా బ్లాక్‌కు చెందిన ఇతర ప్రతినిధులతో పాటు నేతలంతా కారు పైకప్పుపై కూర్చుని ప్రజలకు అభివాదం చేశారు.




02

# శబ్దాలు మితిమీరొద్దు

- వృద్ధులు, గర్భిణులకు ఇబ్బందులు కలిగించొద్దు
- ప్రతి పోలీస్ స్టేషన్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి
- వినాయక ఉత్సవాల నిర్వహణపై హైకోర్టు మార్గదర్శకాలు

వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల్లో లౌడ్ స్పీకర్లు, డీజేల ద్వారా వచ్చే మితిమీరిన శబ్దాలతో వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులెదు ర్కొంటారని హైకోర్టు పేర్కొంది. ఇళ్ల గేట్లకు అడ్డుగా, రోడ్లపై మండపాలు ఏర్పాటు చేస్తే.. అత్యవసర పరిస్థితుల్లో ఆ ఇళ్లలోనివారు బయటికి ఎలా వెళ్తారని ప్రశ్నించింది. అగ్నిమాపక యంత్రాలు, అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని దుస్థితి హైదరాబాద్ నగర రోడ్లపై ఉందని వ్యాఖ్యానించింది. తన ఇంటి గేటుకు అడ్డంగా నడిరోడ్డుపై మండపా న్ని ఏర్పాటు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరినా పోలీసులు స్పందించలే దంటూ సికింద్రాబాద్ ఎంఈఎస్ కాలనీకి చెందిన ప్రభావతి అనే 80 ఏళ్ల వృద్ధురాలు, ఓ గర్భిణి, మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై జస్టిస్ శ్రవణ్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు.

# స్వదేశీ.. మన జీవనమంత్రం కావాలి

### పెట్టుబడి ఎవరిదైనా స్వేదం మనవాళ్లదై ఉండాలి : మోదీ



**అహ్మదాబాద్:** భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా) అనేది దేశీయ తయారీదారుల్లోనే కాకుండా విదేశీ పెట్టుబడిదారులకూ సానుకూల వాతావరణం తీసుకువచ్చిందని ప్రధాని మోదీ చెప్పారు. స్వదేశీ అనేది మన జీవన మంత్రం కావాలని ఆకాంక్షించారు. మారుతీ సుజుకీ తొలి విద్యుత్తు వాహనమైన ఇ-విటారాను మంగళవారం అహ్మదాబాద్ సమీపంలోని హంసలపుర్ కర్మాగారంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగించారు. “స్వదేశీ నిర్వచనం చాలా సరళం. ఎవరి డబ్బును పెట్టుబడి పెట్టారు, అది డాలరా.. పౌండా, అది నల్లధనమా.. తెల్లధనమా అనేవి నాకు అనవసరం. కానీ ఆ డబ్బుతో తయారుచేసే ఉత్పత్తిలో మనవాళ్ల స్వేదమే ఉండాలి. ఆ ఉత్పత్తుల్లో మన మట్టి పరిమళం ఉంటుంది. జపాన్‌కు చెందినప్పటికీ మారుతీ సుజుకీ కూడా స్వదేశీ కంపెనీయే. స్వదేశీని మనం సగర్వంగా హత్తుకోవాలి. దేశీయ ఉత్పత్తులనే కొనాలి. భారత్‌లో తయారైన ఈవీలు ప్రపంచమంతా పరుగులు తీస్తుంటాయి. దేశంలో ఏ రాష్ట్రమూ వెనుకబడకూడదు. మన దేశానికి వచ్చే పెట్టుబడిదారులు ఏ రాష్ట్రానికి వెళ్లాలో తేల్చుకోలేక అయోమయానికి గురికావాలి. అభివృద్ధి ఆధారిత, సుపరిపాలన విధానాలను రూపొందించేందుకు అన్ని రాష్ట్రాలు పోటీపడాలి” అని మోదీ కోరారు. 2012లో తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఈ కర్మాగారానికి స్థలాన్ని కేటాయించిన విషయాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. మేకిన్ ఇండియాపై అప్పట్లోనే తనకు దృష్టి ఉండేదని చెప్పారు. మారుతి లాంటి కంపెనీలు దేశంలో అతిపెద్ద ఎగుమతిదారుగా ఉంటూ మేకిన్ ఇండియాకు ప్రచారకర్తలుగా మారాయని అభినందించారు. “2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించడం నా కల. మన కృషి, త్యాగాలు చూసి భవిష్య తరాలు గర్వపడాలి. దీనికోసం అందరం పాటుపడదాం. ఉజ్వల భవిత కోసం ఆత్మనిర్భర భారత్ మంత్రాన్ని పఠిస్తున్నాం. ఇప్పుడు కార్ల బ్యాటరీలూ మనమే ఉత్పత్తి చేసుకుంటున్నాం” అని చెప్పారు.

# మారుమూల ప్రాంతాలకూ న్యాయసేవలు

### హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్

### సైనికుల కోసం ఎనిమిది జిల్లాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ప్రారంభం




**హైదరాబాద్:** దేశంలోని అన్ని మారుమూల ప్రాంతాలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయసేవలు అందుతున్నాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాలలో ఏర్పాటుచేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్, సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ పి.శ్యాంకోశీలు మంగళవారం ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, వీర పరివార్ సహాయ యోజన కింద దేశవ్యాప్తంగా ఉచిత న్యాయసేవలను అందించాలనే జాతీయ న్యాయసేవాధికార సంస్థ (నల్సా) నిర్ణయం మేరకు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. కుటుంబాలను వదిలి.. దేశ సరిహద్దుల్లో సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికుల కుటుంబాలకు ఈ కేంద్రాలు అండగా ఉంటాయన్నారు. జస్టిస్ పి.శ్యాంకోశీ మాట్లాడుతూ, భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటుచేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా నల్సా రూపొందించిన తెలుగు థీమ్‌సాంగ్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జనరల్ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ సీహెచ్ పంచాక్షరి, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి శాంతివర్ధని తదితరులు పాల్గొన్నారు.



## గవర్నర్లకు విచక్షణాధికారం

- ఆర్థిక బిల్లులును కూడా అడ్డుకోవచ్చు
- ఇది సమస్యాత్మ అంశమని సుప్రీం అభిప్రాయం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 26 :** గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులను ఆపే అధికారం గవర్నర్‌కు ఉంటే.. మనీ బిల్లులను ఆపే అధికారం కూడా గవర్నర్‌కు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ అంశం కొంత సమస్యాత్మకమనేనని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. బిల్లులకు గవర్నర్లు ఆమోదం ఇవ్వకుండా వీటో చేస్తే.. వారు మనీ బిల్లులను కూడా అడ్డుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. సుప్రీం ధర్మాసనం అభిప్రాయంతో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే ఏకీభవించారు. బిల్లుల ఆమోదం అంశంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించడంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. బిల్లులను 3 నెలల గడువులోగా గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదించాలంటూ గతంలో జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై దుమారం రేగింది. దీంతో రాష్ట్రపతి దౌపది ముర్ము 12 సందేహాలను లేవనెత్తారు. రాజ్యాంగంలో లేని అధికారాలపై సుప్రీంకోర్టు తీర్పులు ఎలా ఇవ్వగలదని అపెక్స్ కోర్టుకు 12 ప్రశ్నలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సీజేఐ బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, పీఎస్ నరసింహా, ఏఎస్ చందూర్‌కర్‌తో కూడిన రాజ్యాంగ ధర్మసనం మంగళవారం నాడు విచారణ జరుపుతోంది.

## సరిహద్దుల్లో ఉద్దేశపూర్వకంగానే ప్రాదేశిక మార్పులు

### కేంద్రమంత్రి అమిత్ షా పిలుపు



**ఢిల్లీ:** దేశ సరిహద్దుల్లో అక్రమంగా మతపరమైన చొరబాట్లు పెద్దఎత్తున జరుగుతున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇవి ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న ప్రాదేశిక మార్పులేనని, వీటివల్ల దేశ భద్రతపై ప్రత్యక్ష ప్రభావం పడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మంగళవారం దిల్లీలో జరిగిన వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం(వీవీపీ) వర్క్‌షాప్‌లో అమిత్‌షా పాల్గొని ప్రసంగించారు. సరిహద్దు జిల్లాల్లో జరుగుతున్న మతపరమైన చొరబాట్లపై తగిన చర్యలు తీసుకోవాలని, సరిహద్దుల నుంచి కనీసం 30 కి.మీ. దూరం వరకు జరుగుతున్న చొరబాట్లను నివారించాలని కలెక్టర్లను కోరారు. ఇవి కేవలం భౌగోళిక పరిస్థితుల కారణంగానే జరగటం లేదని...దీని వెనుక ఉద్దేశపూర్వక కుట్ర ఉందని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించడంలో గుజరాత్ అద్భుతంగా పనిచేస్తోందని రాష్ట్ర అధికారులపై ప్రశంసల జల్లు కురిపించారు. వీవీపీ లోగోను ఆవిష్కరించారు.

## బీహార్‌లో రాహుల్ ఓటర్ అధికార యాత్ర

### పాల్గొన్న సిఎం రేవంత్, డిప్యూటి భట్టి, మంత్రులు



**పాట్నా, ఆగస్ట్ 26 :** బీహార్‌లో ఓటర్ అధికార యాత్ర తిరిగి ప్రారంభమైంది. మంగళవారం బీహార్ లోని సుపాల్ లో సాగుతున్న ఓటర్ అధికార్ యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కలసి ప్రియాంకగాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఆర్జేడీనేత తేజస్వి యాదవ్, ఇండియా బ్లాక్‌కు చెందిన ఇతర ప్రతినిధులతో పాటు నేతలంతా కారు పైకప్పుపై కూర్చుని ప్రజలకు అభివాదం చేశారు. ఒకరోజు విరామం తీసుకున్న వోట్ అధికార్ యాత్ర మంగళవారం తిరిగి ప్రారంభమైంది. ఆదివారం అరారియాలో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీమాట్లాడుతూ..బీహార్‌లోని అన్ని భారత కూటమి నియోజకవర్గాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఐక్యంగా పనిచేస్తున్నాయన్నారు. మంచి ఫలితాలుంటాయని చెప్పారు. ప్రతిపక్ష కూటమిలోని అన్ని నియోజకవర్గాలు ఐక్యంగా పనిచేస్తున్నాయి. మేం సైద్ధాంతికంగా,రాజకీయంగా కలుపుకుపోతున్నామన్నారు. పరస్పరం ఒకరినొకరు గౌరవించుకుంటూ పోతున్నామన్నారు. బీహార్ ఎన్నికల సందర్భంగా ఇండియా కూటమి త్వరలో మేనిఫెస్టోను విడుదల చేస్తుందని రాహుల్ గాంధీ అన్నారు.

## 3,574 మంది టీచర్లకు పదోన్నతి

**హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే 3,574 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీలు) స్కూల్ అసిస్టెంట్లుగా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు (పీఎస్‌హెచ్‌ఎంలు)గా పదోన్నతి పొందారు. స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందినవారు (2,763 మంది) ఇక నుంచి ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు నిపుణులుగా పాఠాలు బోధిస్తారు. పీఎస్‌హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందినవారు (811 మంది) వారికి కేటాయించిన ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరిస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 21న 880 మంది స్కూల్ అసిస్టెంట్లు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు(జీహెచ్‌ఎం)గా పదోన్నతి పొందిన సంగతి తెలిసిందే. తాజాగా ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పించినట్లు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తెలిపారు. పదోన్నతులు పొందినవారు 15 రోజుల్లోపు.. వారికి కేటాయించిన పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించాల్సి ఉంటుంది. బుధవారం పండగ సెలవు నేపథ్యంలో అధిక శాతం మంది మంగళవారమే రిలీవ్ అయి కొత్త పాఠశాలల్లో చేరారు. వరుసగా రెండో ఏడాది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించారంటూ.. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌టీఫ్) రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు ఆధ్వర్యంలో ఖమ్మంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి చిత్రపటాలకు ఉపాధ్యాయులు క్షీరాభిషేకం చేశారు.




## శబ్దాలు మితిమీరొద్దు

- వృద్ధులు, గర్భిణులకు ఇబ్బందులు కలిగించొద్దు
- ప్రతి పోలీస్ స్టేషన్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి
- వినాయక ఉత్సవాల నిర్వహణపై హైకోర్టు మార్గదర్శకాలు

**హైదరాబాద్:** వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల్లో లౌడ్ స్పీకర్లు, డీజేల ద్వారా వచ్చే మితిమీరిన శబ్దాలతో వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటారని హైకోర్టు పేర్కొంది. ఇళ్ల గేట్లకు అడ్డుగా, రోడ్లపై మండపాలు ఏర్పాటు చేస్తే.. అత్యవసర పరిస్థితుల్లో ఆ ఇళ్లలోనివారు బయటికి ఎలా వెళ్తారని ప్రశ్నించింది. అగ్నిమాపక యంత్రాలు, అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని దుస్థితి హైదరాబాద్ నగర రోడ్లపై ఉందని వ్యాఖ్యానించింది. తన ఇంటి గేటుకు అడ్డంగా నడిరోడ్డుపై మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరినా పోలీసులు స్పందించలేదంటూ సికింద్రాబాద్ ఎంఈఎస్ కాలనీకి చెందిన ప్రభావతి అనే 80 ఏళ్ల వృద్ధురాలు, ఓ గర్భిణి, మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై జస్టిస్ శ్రవణ్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. మండపాల ఏర్పాటుతో సాధారణ ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులకు, గర్భిణులకు ఇబ్బందుల్లేకుం డా అధికారులు చూడాలని ఆదేశించారు. ఉత్సవాలు కొనసాగే 9 రోజులూ ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్వీకరించడానికి ప్రతి పోలీసు స్టేషన్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. మండపాల ఏర్పాటుకు అనుమతులు, నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు.

### మార్గదర్శకాలివే...

- స్థానిక సంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మైదానాలు, ఖాళీ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మండపాల ఏర్పాటుకు పోలీసులు, మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకోవాలి.
- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదు. ఇళ్ల ప్రవేశద్వారాలకు, ఆసుపత్రులకు, అంబులెన్స్, ఫైరింజన్‌ల రాకపోకలకు అడ్డంకిగా ఉండకూడదు.
- మండపాలకు తీసుకునే విద్యుత్తు కనెక్షన్లు సురక్షితంగా ఉండాలి.
- సౌండ్ సిస్టంలను సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే అనుమతించాలి. నిబంధనల మేరకు అనుమతించిన పరిమితిని మించి శబ్దం రాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.
- మితిమీరిన శబ్దం, న్యూసెన్స్‌పై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణం చర్యలు తీసుకోవాలి.
- అగ్నిమాపక, అత్యవసర వాహనాలు వెళ్లడానికి దారి ఉండాలి.
- విగ్రహాల నిమజ్జనం, ఊరేగింపులకు సంబంధించి హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలి. నిమజ్జనం అనంతరం మండపాల ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించే బాధ్యత నిర్వాహకులదే.
- శబ్ద నియంత్రణ, పర్యావరణ నిబంధనల అమలుపై ప్రతి మండపం తరఫునా ఓ బాధ్యతాయుత వ్యక్తి నుంచి హామీ తీసుకోవాలి.

## సీఎం రేవంత్ రెడ్డిది బజారు భాష

- ప్రజలను మభ్య పెట్టేందుకు ఎత్తులు
- ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని గుర్తించాలి
- మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు మధుసూధనాచారి, జోగు




**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** సీఎం రేవంత్ రెడ్డి బజారు భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. మంగళవారం తెలంగాణభవన్ లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఫామ్‌హౌజ్‌లో మానవ మృగాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం తీవ్రమైన విషయమన్నారు. కేసీఆర్‌కు, తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. అహింస పద్ధతుల్లో తెలంగాణ తెచ్చిన మరో గాంధీ కేసీఆర్ అని అన్నారు. మృగత్వానికి ప్రతిరూపాలు కాంగ్రెస్ పాలకులే అని చెప్పారు. ఎమర్జెన్సీ పెట్టి ప్రజలతో హాహాకారాలు చేయించిన ఇందిరాగాంధీ మృగత్వానికి ప్రతీక అన్నారు. నాడు ఢిల్లీలో టర్క్ మెన్ గేట్ దగ్గర వెలాది పేదల ఇండ్లు కూల్చిన మృగత్వం కాంగ్రెస్ పార్టీ సొంతమని విమర్శించారు. 1969 ఉద్యమంలో వందలాది మందిని పొట్టన పెట్టుకున్న మృగత్వం కాంగ్రెస్ పార్టీదేనని, సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మృగత్వం ఆనవాళ్లను వంట పట్టించుకున్నారని మధుసూదనాచారి విమర్శించారు. హామీలను నెరవేర్చడం చేతగాకనే సీఎం రేవంత్ రెడ్డి పిచ్చి భాష మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణను సువర్ణ తెలంగాణగా మార్చిన కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. తెలంగాణలో ప్రధాన సమస్యలన్నింటిని కేసీఆర్ పరిష్కరించారని అన్నారు. సీఎం రేవంత్‌కు అధికారంతో ఒళ్ళు కొవ్వెక్కిందని మధుసూదనాచారి ఆగ్రహం వ్యక్తంచేశారు. అందుకే బలుపు మాటలు మాట్లాడు తున్నారని విమర్శించారు. సీఎం మాటలకు విశ్వసనీయత లేదని అన్నారు. అది నోరా.. మోరా..? అని మండిపడ్డారు. యూరియా ఇవ్వని అసమర్థుడు రేవంత్ రెడ్డి అని చెప్పారు. గతంలో ఏ కాంగ్రెస్ సీఎం ఇంత నీచమైన భాష మాట్లాడలేదన్నారు. రేవంత్ రెడ్డి ఓయూను స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ-లు చేస్తాననడం హాస్యాస్పదమన్నారు. ప్రజలను క్షోభ పెడుతూ రేవంత్ మాయమాటలు చెబుతున్నారని మధుసూదనాచారి మండిపడ్డారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వంద సీట్లు- గెలుస్తామంటున్నాడని, ముందుగా పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలి సవాల్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే సీఎం రేవంత్ రెడ్డికి రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. ప్రగతి భవన్ కంచెలు తీశామని చెబుతూ ఓయూలో కంచెలు ఎందుకు ఏర్పాటు చేశావని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సీఎం పోస్టుకు గౌరవం పెంచేలా మాట్లాడాలని, పిచ్చి వాగుడు వాగితే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవర్తన ఏమాత్రం బాగలేదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. రేవంత్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా కాళేశ్వరం పాట పాడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థుల దగ్గరకు వెళ్లి కూడా కేసీఆర్ గురించి మాట్లాడుతున్నారని, నిత్యం కేసీఆర్‌ను తలుచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ప్రవర్తన వల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటు-ందని జోగు రామన్న మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో కట్టిన భవనాలకు రేవంత్ రెడ్డి రిబ్బన్ కట్ చేస్తున్నారని, ఆయన కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీ ఏమీ లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా విఫలమయ్యారని విమర్శించారు. రేవంత్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై దృష్టి..


### రేపటి నుంచి తుది కసరత్తు షురూ

**హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఎన్నికల అధికారులు దృష్టి సారించారు. షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ ఏడాది చివరిలో బిహార్ సాధారణ ఎన్నికలతో పాటు తెలంగాణ, రాజస్థాన్, పంజాబ్, మిజోరం, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఖాళీ అయిన స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అవసరం ఏర్పడింది. ఇందుకోసం ఈ నెల 28 నుంచి స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్) షెడ్యూల్ ప్రక్రియను ఎన్నికల అధికారులు ప్రారంభించనున్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియతో ఇది ప్రారంభమవుతుంది. నియోజకవర్గంలో మొత్తం 329 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి 1,200 మంది ఓటర్లకు ఒకటి ఉండాలని నిర్దేశించడంతో మరో 79 అవసరమని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎక్కడెక్కడ పెట్టాలో గురువారం నుంచి కసరత్తును ప్రారంభించనున్నారు. ప్రస్తుతం బిహార్‌లో ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తయిన తర్వాత ఓటరు జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే అక్టోబరు మొదటి వారంలో షెడ్యూల్ ప్రకటించి నవంబరులో ఎన్నికలకు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోపక్క ఎస్ఐఆర్‌పై అక్కడ వివాదం నడుస్తోంది. ఉప ఎన్నిక నేపథ్యంలో రాజకీయ పార్టీలు కొత్తవారిని చేర్పించడంపై దృష్టి సారించాయి. ఈ ఏడాది జులై 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకుంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటు వేసే అవకాశం ఉంటుంది. ఆగస్టు 20 నాటికి నియోజకవర్గం పరిధిలో మొత్తం 3,92,403 మంది ఓటర్లు ఉన్నారు. సెప్టెంబరు 30న ప్రకటించే తుది జాబితా నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

## యువకుల వేధింపులతో బాలిక మృతి

**సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన ఒక బాలిక (17) మృతి చెందగా.. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాలికను సోమవారం కుటుంబసభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందింది. ముగ్గురు యువకుల వేధింపులతో తన కుమార్తె మృతి చెందిందని బాలిక తండ్రి మంగళవారం పోలీసుల ఎదుట ఆరోపించారు. తన కుమార్తెను బెదిరించి నగ్నంగా వీడియో తీసిన ముగ్గురు యువకులు కొంతకాలం లైంగికదాడికి పాల్పడడంతో ఆమె అనారోగ్యం బారిన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెను సోమవారం సిరిసిల్ల ఆస్పత్రికి తీసుకురాగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని కన్నీరుమున్నీరయ్యారు. యువకుల వేధింపులపై తన కుమార్తె రాసిన లేఖ ఇంట్లో దొరకడంతో మృతిపై అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. బాలిక తల్లిదండ్రులు కొంతకాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. బాలిక తండ్రి వద్ద ఉంటోంది. విషయం తెలిసి వచ్చిన తల్లి.. కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇల్లంతకుంట ఎస్సై అశోక్ తెలిపారు. శవ పరీక్ష నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

# స్థానిక ఎన్నికలపై కసరత్తు




- ఓటర్ల జాబితా విడుదలకు ఇసి నోటిఫికేషన్
- 28లోపు ముసాయిదా జాబితా ప్రకటన

**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లోని ఫోటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది. ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఇక ఆ మరునాడే.. అంటే ఆగస్టు 29వ తేదీన ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫోటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణకు ఆదేశించింది. ఇదిలావుంటే తెలంగాణ కేబినెట్ సమావేశం ఆగస్టు 29న మద్యాహ్నం 3:30గంటలకు జరగనుంది. సెక్రటేరియట్ లో సీఎం రేవంత్ అధ్యక్షతన ఈ భేటీ- జరగనుంది. బీసీ రిజర్వేషన్లు, అసెంబ్లీ సమావేశాల తేదీ ఖరారు, సర్పంచ్ ఎన్నికలు,కాళేశ్వరం నివేదికపై ప్రధానంగా ఈ భేటీ-లో చర్చించనున్నారు. ముఖ్యంగా అందరు ఎదురు చూస్తోన్న పంచాయతీ ఎన్నికల నిర్వాహణపై ఈ కేబినెట్ భేటీలో క్లారిటీ రానుంది. సెప్టెంబర్ 30 లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికలపై స్పష్టత కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతంరిజర్వేషన్లు కల్పించే బిల్లు, పంచాయతీ రాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండటంతో రిజర్వేషన్లపై ఇప్పటికే న్యాయ నిపుణుల సలహా తీసుకుంది సబ్ కమిటీ. ఆగస్టు 28 లోపు ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనుంది . సబ్ కమిటీ ఇచ్చే నివేదికపై కేబినెట్ లో చర్చిం చి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనుంది.



## భారత ఎగుమతులపై
# 50శాతం సుంకాలు

- నేటి నుంచే అమల్లోకి రానున్న ట్రంప్ ఆదేశాలు
- సవాళ్లకు సిద్ధంగా ఉన్నామన్న ఆర్‌బిఐ

**వాషింగ్టన్, ఆగస్ట్ 26 :** భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ సర్కార్.. రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్‌పై మరో 25 శాతం టారీఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఆగస్టు 6న ఈ ఎగ్జిటీవ్ ఆర్డర్‌పై 14329పై సంతకం చేసిన ట్రంప్..ఈ నెల 27 నుంచి 50 శాతం టారీఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. దీంతో తాజాగా 25 అదనపు సుంకాలపై అమెరికా అధికారికంగా బహిరంగ నోటీసులు జారీ చేసింది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కొత్త సుంకాలు ఆగస్టు 27 తెల్లవారుజాము 12.01 గంటల నుంచే అమల్లోకి వస్తాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ద్వారా హోమ్‌లాండ్ ఆఫ్ సెక్యూరిటీ- విడుదల చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన అధిక సుంకాల్లో మొత్తం ఎగుమతిదారుల గుండెల్లో రైళు పరుగెడుతుంటే.. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాత్రం టారిఫ్‌ల ప్రభావంపై మాట్లాడారు. యుఎస్ విధించిన 50 శాతం టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. యుఎస్ టారిఫ్‌లు దేశీయ ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తే ఆర్‌బిఐ తగిన విధాన చర్యలతో స్పందిస్తుందన్నారు. మేము బ్యాంకింగ్ రంగానికి తగినంత నగదు లభ్యతను అందించాము. ముఖ్యంగా ఎక్కువగా ప్రభావితమైన రంగాలకు మద్దతును ఇవ్వడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాము. ఆర్‌బిఐ ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే మరోవైపు ఆర్థిక వృద్ధిపై దృష్టి కోల్పోలేదని మల్హోత్ర అన్నారు.భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని మల్హోత్ర ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ వద్ద ఇప్పటికే 695 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య నిల్వలు ఉన్నాయని.. ఇవి 11 నెలల విదేశీ వాణిజ్యానికి సరిపోతాయన్నారు. సుంకాల మొత్తం ప్రభావం తక్కువగా ఉంటు-ందని మల్హోత్ర తెలిపారు. అయితే.. రత్నాలు, ఆభరణాలు, -టె-క్స్-టైల్స్, దుస్తులు, ఎంఎస్ఎంఇ రంగాలపై కొంత ప్రభావం ఉండవచ్చన్నారు. ప్రభుత్వం ఉచిత వాణిజ్య ఒప్పందాలపై కూడా దృష్టి సారిస్తోందన్నారు. వృద్ధికి తమ వంతుగా ఇప్పటికే రెపోరేటు-ను 100 బేసిస్ పాయింట్లు- తగ్గించిందని గుర్తు చేశారు. అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అంశాలను అధిగమించేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. బ్యాంక్ రుణాలను విస్తరించేందుకు అవసరమైన చర్యలను తాము పరిశీలిస్తున్నామన్నారు. పెట్టుబడుల సైకిల్‌ను సృష్టించేందుకు వీలుగా కార్పొరేట్‌లు, బ్యాంక్‌లు ఓ తాటి పైకి వచ్చి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే దేశాభివృద్ధి ముందు కెళ్తుందని మల్హోత్ర అన్నారు. ధరల స్థిరీకరణ, ఆర్థికవృద్దే లక్ష్యంగా ద్రవ్య పరపతి విధానం కొనసాగుతుందన్నారు. స్థూలంగా భారత ఆర్థికవ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయన్నారు.

## 29 నుంచి ఎడ్‌సెట్ చివరి విడత కౌన్సెలింగ్

**హైదరాబాద్:** బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 29 నుంచి ఎడ్‌సెట్ చివరి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సెప్టెంబరు 2 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 5, 6 తేదీల్లో వెబ్ ఆప్షన్లు, 11న సీట్ల కేటాయింపు ఉంటుందని ప్రవేశాల కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు.

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనం పశ్చిమ వాయువ్య దిశలో కదిలి ఉత్తర ఒడిశా దాని సమీపంలోని చత్తీస్‌గఢ్‌ల మీదుగా కదిలే అవకాశం ఉందని పేర్కొంది. రాబోయే రెండు రోజుల్లో అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందని వివరించింది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలు కురవ-నున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురువనున్నాయి. కాకినాడ, పోలవరం, ఏలూరులో భారీ వర్షాలు, ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## హిమాచల్‌లో భారీ వర్షాలు
### ప్రమాదస్థాయిలో బియాస్ నది ప్రవాహం

**సిమ్లా, ఆగస్ట్ 26 :** హిమాచల్ ప్రదేశ్ పై మళ్లీ ప్రకృతి తన ప్రకోపాన్ని చూపించింది. తీవ్ర స్థాయి వర్షాల వల్ల కొండ చరియలు విరిగిపడ్డాయి. భారీ వరదల వల్ల కిరాట్పూర్- మనాలీ జాతీయ హైవేపై నష్టం జరిగింది. దీంతో మండీ, మనాలీ లో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల .. బియాస్ నది ఉప్పొంగుతున్నది. దాని ఉప నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో అత్యవసర సహాయక చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారి పలు ప్రదేశాల్లో బ్లాక్ అయ్యింది. మనాలీ సమీపంలో ఉన్న బిందు ధంక్ వద్ద బియాస్ నది వరద నీటికి జాతీయ హైవే కొట్టుకుపోయింది. దీంతో మనాలి పర్యాటక కేంద్రానికి రాకపోకలు తెగిపోయాయి. మనాలీలో నది సమీపంలో ఉన్న ఓ హోటల్.. ఆ వరదలో కొట్టుకుపోయింది. మండి, కులు ప్రాంతాల్లో డేంజర్ మార్క్ దాటి నది ప్రవహిస్తున్నది. లోతట్టు- ప్రాంతాల్లో జీవిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. బహంగ్, అలూ గ్రౌండ్ ప్రాంతాల నుంచి జనాలను తరలిస్తున్నారు. మరో 24 గంటల పాటు- నది సమీపానికి వెళ్లవద్దు అని పర్యాటకులకు అధికారులు హెచ్చరిక చేశారు.

## కాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్‌తో నలుగురు మృతి

**శ్రీనగర్,ఆగస్ట్ 26 :** జమ్మూకశ్మీర్‌ను భారీ వర్షాలు కుదిపేస్తున్నాయి. స్థానికంగా ఆకస్మిక వరదలు విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలోనే డోడా జిల్లాలో క్లౌడ్‌బరస్ట్ కారణంగా నలుగురు మృతి చెందారు. కఠువా, కిశ్త్‌వాడ్‌లోనూ ఇటువంటి విపత్తులు సంభవించాయి. జమ్మూ రీజియన్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. కఠువా, సాంబా, డోడా, జమ్మూ, రాంబన్, కిశ్త్‌వాడ్ జిల్లాల పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్కర వాతావరణ పరిస్థితుల కారణంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాలకుతోడు రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్, కేలామోర్, బ్యాటరీ చెష్మా వద్ద కొండచరియలు విరిగిపడటంతో.. ముందు జాగ్రత్త చర్యగా జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నిలిపేశారు. వరదల ధాటికి కిశ్త్‌వాడ్, డొడా, రాజౌరీ జిల్లాల్లో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చీనాబ్, తావి, రావి తదితర నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. ఈ నెల 27వరకు క్లౌడ్ బరస్ట్‌లు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో సహాయక బృందాలను అప్రమత్తం చేసినట్లు- తెలిపారు.

## 30 నుంచి తెలంగాణ
# అసెంబ్లీ సమావేశాలు

- కాళేశ్వరం కమిషన్‌పై చర్చించే అవకాశం
- తొలిరోజు సభ అనంతరం.. మంత్రివర్గ భేటీ
- బీసీ రిజర్వేషన్ల జీఓ జారీపై చర్చ



**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు అసెంబ్లీ సమావేశం పూర్తయ్యాక మంత్రివర్గం భేటీ కానుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై జీఓ జారీ విషయమై.. క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. మారిన పరిణామాల నేపథ్యంలో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీఓ జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లో దీనిపై మరింత స్పష్టత రానుంది. అసెంబ్లీ సమావేశాలను 3-4 రోజుల పాటు నిర్వహించే అవకాశాలున్నాయి. ముఖ్యంగా ఈ సమావేశాల సందర్భంగా.. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన 650 పేజీల నివేదిక సమగ్ర ప్రతిని అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలోనే చర్చకు పెడతామని, అన్ని పార్టీలకు మాట్లాడే అవకాశమిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంతకుముందే ప్రకటించారు. ఇటీవల హైకోర్టుకు కూడా ప్రభుత్వం ఇదే విషయాన్ని నివేదించింది. అసెంబ్లీలో చర్చించిన తర్వాత.. తదుపరి ఏం చేయాలో నిర్ణయిస్తామని తెలిపింది. ఈ అంశంపై ప్రభుత్వం సుదీర్ఘంగా చర్చ చేపట్టే అవకాశం ఉంది. దీనిపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది. కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జోక్యమే కారణమని కమిషన్ నివేదికలో ప్రస్తావించడం, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను తప్పుపట్టిన నేపథ్యంలో.. అసెంబ్లీలో జరిగే చర్చ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశాలకు కేసీఆర్ హాజరై, తన వాదనను అసెంబ్లీ వేదికగా వినిపిస్తారో.. లేదో చూడాల్సి ఉంది. అసెంబ్లీ ప్రారంభం రోజున దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు నివాళులర్పించి.. సభను వాయిదా వేసే అవకాశం ఉంది. ఈ నెల 29న మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని.. 24న జరిగిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు 29న మధ్యాహ్నం మూడు గంటలకు మంత్రివర్గ సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం తొలుత ఆదేశాలు జారీ చేశారు కూడా. కానీ మంత్రివర్గ భేటీ 30వ తేదీకి మారింది. బీసీ రిజర్వేషన్లపై న్యాయ సలహా తీసుకుని మంత్రివర్గ సమావేశంలో నివేదించడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఉప సంఘాన్ని ఇప్పటికే ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు సోమవారం సాయంత్రం దిల్లీ వెళ్లారు. మంగళవారం బిహార్‌లో రాహుల్‌గాంధీ చేపట్టిన యాత్రలో పాల్గొనడానికి వెళ్లినా, సోమవారం సాయంత్రం రాష్ట్ర నాయకులు.. పార్టీ జాతీయ నాయకులతో సమావేశమైనట్లు తెలిసింది. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై చర్చ జరిగినట్లు సమాచారం. బిల్లు, ఆర్డినెన్స్ తెచ్చినా.. వాటికి రాష్ట్రపతి ఆమోదం లభించకుండా కేంద్రం అడ్డుకుందని, జీఓ ద్వారా కూడా ఇచ్చి ప్రయత్నం చేద్దామని కొందరు ప్రస్తావించినట్లు తెలిసింది. 50 శాతానికి మించి రిజర్వేషన్ కల్పిస్తూ జీఓ ఇచ్చినా కోర్టులో నిలవదని, ఎన్నికలు జాప్యమయ్యే అవకాశం ఉందని కొందరు పేర్కొన్నా, చివరకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీఓ ఇవ్వాలనే నిర్ణయించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

## ఫోక్సో కేసులో
# నల్లగొండ కోర్టు సంచలన తీర్పు
### హత్యాచార నిందితుడికి 51 ఏళ్ల జైలుశిక్ష



**నల్గొండ, ఆగస్ట్ 26 :** బాలికపై అత్యాచారం కేసులో నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి 51 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి రోజారమణి తీర్పు వెలువరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై 2021లో తిప్పర్తి పీఎస్‌లో మహ్మద్ ఖయ్యూమ్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. 2022 నుంచి జిల్లా కోర్టులో వాదనలు కొనసాగగా.. తాజాగా తీర్పు వెల్లడైంది. అంతేకాదు.. 85 వేలు జరిమానా విధిస్తూ బాధితురాలికి 7 లక్షల పరిహారం అందించాలని నల్గొండ జిల్లా కోర్టు ఆదేశించింది. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడు ఖయ్యూంకి ఈ కఠిన కారాగార శిక్షను కోర్టు విధించింది. తిప్పర్తి గ్రామం, మండలానికి చెందిన నిందితుడు ఖయ్యూంను ఎస్సీ ఎస్టీ కోర్ట్ జడ్జి రోజా రమణి దోషిగా తేల్చారు. నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో బలమైన సాక్ష్యాధారాలను తిప్పర్తి ఎస్ఐ శంకర్ దాఖలు చేశారు. జడ్జి రోజా రమణి ఈ తరహా తీర్పును వెలువరించడం ఈ నెలలో ఇది రెండోసారి. బాలికను అత్యాచారం చంపేసిన వ్యక్తికి నల్గొండ పోక్సో కోర్టు ఉరి శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. 2013లో ఈ ఘటన జరిగింది. నల్గొండ హైదర్ఖాన్ గూడలోని ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న 11 ఏండ్ల బాలికపై మాన్యం చెల్కకు చెందిన మహ్మద్ ముక్రం అత్యాచారం చేశాడు. రేప్ చేసిన విషయం ఎక్కడ బయటపడుతుందో అన్న భయంతో బాలిక మెడకు చున్నీ బిగించి హత్య చేశాడు. తర్వాత డెడ్ బాడీని డ్రైనేజీలో పడేశాడు. ఈ ఘటన 2013, ఏప్రిల్ 28న జరిగింది. బాలిక కనిపించకపోవడంతో పేరెంట్స్ నల్గొండ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశాక విచారించిన పోలీసులు.. 2015లో చార్జిషీట్ దాఖలు చేశారు. పదేండ్ల పాటు- సుదీర్ఘ వాదనలు, వాయిదాలు కొనసాగాయి. నిందితుడు ముక్రంను పోక్సో కోర్టు దోషిగా తేల్చింది. దీంతో నిందితుడు ముక్రంకు ఉరిశిక్ష విధిస్తూ పోక్సో కోర్టు ఇన్ ఛార్జి జడ్జి జస్టిస్ రోజా రమణి తీర్పు వెలువరించారు. దీంతో పాటు- రూ.1.10 లక్షల జరిమానా విధించారు. బాలిక ఫ్యామిలీకి రూ.10 లక్షలు పరిహారం అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

## కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే..
# రాజకీయ సన్యాసం

- ఓట్ చోరీ అంటూ ప్రజలను అవమానిస్తున్న కాంగ్రెస్
- ఓట్ చోరీ జరిగితే బిజెపి 16 సీట్లు గెలిచేది
- మాది నిజంగానే దేవుళ్ల పార్టీ
- కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్, ఆగస్ట్ 26 :** కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే.. రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాగ్దానాలు అమలుకాలేదని, మోసపూరిత హామీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆ పార్టీకి మళ్లీ అధికారం కలేనని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెప్పాలని బండి సవాల్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించిన సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. దొంగ ఓట్లు- అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమేనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

### పీసీసీ అధ్యక్షుడు సీట్ల చోరీ గురించి మాట్లాడాలి

కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు- వేయడం ఎవరికైనా సాధ్యమా?అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రొహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు- బ్యాంకు ముఖ్యమా? అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని బండి సంజయ్ విమర్శించారు. ప్రజలను కలవకుండా రాత్రి పూట యాత్రలు ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. టీ-పీసీసీ చీఫ్ ఒక గజినీ.. ఆయనను ఎవరైనా గుర్తు పడతారా అని ప్రశ్నించారు. మహేష్ గౌడ్ వార్డు మెంబర్‌గా కూడా గెలిచావా అని బండి సంజయ్ నిలదీశారు. తెలంగాణలో ఓటు- చోరీ జరిగితే.. కాంగ్రెస్ ఎనిమిది ఎంపీ సీట్లు కూడా తామే గెలిచేవాళ్లమని చెప్పుకొచ్చారు. ప్రజల ఓట్లతో మహేష్ గౌడ్ ఒక్కసారైనా గెలవాలని ఛాలెంజ్ చేశారు. కర్ణాటక, తెలంగాణలో మీరెలా గెలిచారని ప్రశ్నించారు. టీపీసీసీ చీఫ్ బీఆర్ఎస్ మనిషి అని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆయనకు సెక్యూరిటీ- కావాలని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఓటు- చోరీ జరిగిందని ప్రజలను మహేష్ గౌడ్ అవమానిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలే ఓట్ల బిచ్చగాళ్లు అని విమర్శించారు. టోపీలు పెట్టుకుని ఓట్ల కోసం వెళ్లేది కాంగ్రెస్ నేతలే అని ఆక్షేపించారు. రోహింగ్యాలు వచ్చింది కాంగ్రెస్ హయాంలోనేనని బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. సనాతన ధర్మం కోసం బిజెపి నిలబడుతుందని, యుపిఎ హయాంలోనే రోహింగ్యాలు దేశంలోకి వచ్చారని తెలిపారు. కరీంనగర్ లో హిందూ ఓటు- ద్వారానే గెలిచానని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ప్రకృతి ప్రేమే.. వినాయక పూజ!



భారతీయ సాంప్రదాయాలు, పండగలు అన్నీకూడా ప్రకృతితో ముడిపడి ఉన్నవే. ప్రకృతిని ఆరాధించడం మనజీవితంలో నిత్యకృత్యం. ప్రకృతితో ముడిపడి ఉన్న పంచభూతాలను ఆరాధించడం వేదకాలం నుంచే ఉంది. మట్టితో గణపతులను చేయడం, పూలూపత్రి పెట్టడం, అవన్నీ చెరువులో వేయడం వెనక ప్రకృతి పరమార్థం దాగివుంది. మన పండగలన్నీ ప్రకృతి ఆరాధనతో మమేకమై వుంటాయి. వినాయకచవితి పర్వదినంలో మనం అనేక పుష్పాలు, ఫలాలతో స్వామిని పూజిస్తాం. విఘ్నాలను నివారించే వినాయకుని పూజతో మనం పండగను జరుపుకొంటాం. వినాయక పూజలో ఉపయోగించే పత్రిలో విశేష ఔషధ గుణాలు ఉన్నాయి. గోరంత పత్రి పెడితే చాలు కొండంత వరాలు గుప్పిస్తాడు. అందుకే వినాయక పూజ అంటే అందరికీ ఇష్టం. వారిని ప్రోత్సహించడం ద్వారా ప్రకృతికి పాటుపడేలా చేయాలి. ఉండ్రాళ్ళ నైవేద్యానికే మహదానందపడిపోతాడు విఘ్నేశ్వరుడు. ఒక్క వినాయకుడికే పత్రిపూజ ఎందుకు చేస్తాం? ఎందుకంటే ఆయన గజముఖుడు కదా! ఏనుగుకు ఇష్టమైనవి ఆకులే కదా! అందుకే ఈ పత్రి పూజ. ఏకవింశతి... అంటే ఇరవైఒక్క రకాల పత్రితో గణేశుణ్ణి పూజిస్తాం. గజాననుడని కీర్తించినా, మూషిక వాహనుడని మొక్కినా, సర్వవిఘ్నాలకు అధినాయకుడని శిరస్సు వంచినా తొలిపూజలు దక్కేదతనికే. అందుకే భాద్రపద శుక్ల చవితి రోజున భక్తి శ్రద్ధలతో వినాయక పూజ చేసుకోవడం పుణ్యప్రదం.. మోక్ష దాయకం! అయితే ప్రకృతిని ఆరాధిస్తున్న మనం..దాని విధ్వంసాన్ని పట్టించుకోవడం లేదు. ప్రకృతి పరిరక్షణ చర్యలను పెద్దగా గుర్తించడం లేదు. దీనినుంచి బయటపడే మార్గాలను ఆలోచించాలి. విఘ్నాలను నివారించే వినాయకుని పూజతో మనం పండగను జరుపుకొంటాం. గణపతి అంటే ప్రకృతి ప్రియుడు. ఆయనకు మనం చేసే పూజ అంతా ప్రకృతి ఆరాధన కిందకే వస్తుంది. చెరువుల్లో మట్టిని తవ్వి తీసుకుని వచ్చి వినాయకుడిగా చేసి, మళ్లీ చెరువలోనే పూజించిన పత్రీపూలతో నిమజ్జనం చేయడం వెనక శాస్త్రీయత ఉంది. మట్టిని తీసి మళ్లీ అది ఎరువుగా, చెరువు నీరు కాలుష్య రహితంగా కావడానికి జరిగే ప్రక్రియ ఇందులో ఇమిడి ఉంది. మనం పూజించే మారేడు, ఉత్తరేణి వంటివి ఔషధ గుణాలు కలిగి ఉండడం వల్ల వీటిని కాలుష్యం నుంచి కాపాడుతాయి. అందుకే వినాయకచవితి ఎన్నో ప్రత్యేకతలు కలిగిన పర్వదినంగా చూడాలి. ఏటా కొన్ని వేల గణపతి విగ్రహాలను రంగులతో అలంకరించి మండపాల్లో ఏర్పాటుచేయడాన్ని చూస్తుంటాం. అలాగే ప్రతి ఇంట్లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి పూజ నిర్వహిస్తాం.

ఇవన్నీ ప్రకృతికి దగ్గరగా ఉండేలా చూడాలి. అలాగే ప్రకృతి పరిరక్షణ ద్వారా పండగల పరమార్థం తెలుసుకోవాలి. గణపతి నవరాత్రుల కోసం ఖర్చు చేసే మొత్తాన్ని ప్రకృతి పరిరక్షణకు ఉపయో గిస్తే కరోనా లాంటి వైరస్‌లు మనలను ఏమీ చేయలేవు. వినాయకచవితి పర్వదినంలో మనం అనేక పుష్పాలు, ఫలాలతో స్వామిని పూజిస్తాం. నేత్ర, మూత్ర, చర్మ సంబంధమైన రోగాలతోపాటు మరికొన్ని ఇతర వ్యాధులకు మంచి మందుగా పనిచేస్తుందీ పత్రి. అంతేకాక ఆ పత్రి నుంచి వెలువడే సుగంధాన్ని పీల్చడం వల్ల కూడా స్వస్థత చేకూరుతుంది. పత్రిని మనం చేత్తో ముట్టుకోవడం వల్ల అందులో ఉండే వృక్ష సంబంధ రసాయన పదార్థాలు కావలసిన మోతాదులో చర్మం ద్వారా మన శరీరం లోకి శోషణం చెంది ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. తొమ్మిది రోజుల తర్వాత వినాయకుణ్ణి బావుల్లో, నదుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. ఇలా ఎందుకు చేయడం అంటే కలుషితమైన ఆ నీటిని శుభ్రం చేయడానికి ఈ 21 పత్రాలు ఉపయోగపడతాయట. అందుకే తొమ్మిది రోజుల పూజ తర్వాత విగ్రహంతో పాటు ఆకులను కూడా నీళ్లలో వదిలేసి వస్తారు. ఇవి ఇరవైమూడు గంటలయ్యాక తమలో ఉన్న ఔషధగుణాల ఆల్కలాయిడ్స్‌ని నీళ్లలోకి వదిలేస్తాయి. దాని వల్ల నీటిలో ఉండే బాక్టీరియా నిర్మూలన జరిగి నీళ్లల్లో ఆక్సిజన శాతం పెరుగుతుంది. వినాయక పూజ వల్ల మనకు విఘ్నాలు తొలగి అనుకున్న పనులన్నీ చక్కగా జరుగుతాయి. పిల్లలకు పత్రి సేకరణ వల్ల వృక్ష విజ్ఞానంతో పాటు వినోదం, పర్యావరణం పట్ల స్నేహభావం కలుగుతాయి. చెరువుల్లో మట్టిని తవ్వి తీసుకుని వచ్చి వినాయకుడిగా చేసి, మళ్లీ చెరువలోనే పూజించిన పత్రీపూలతో నిమజ్జనం చేయడం వెనక శాస్త్రీయత ఉంది. మట్టిని తీసి మళ్లీ అది ఎరువుగా, చెరువు నీరు కాలుష్యరహితంగా కావడానికి జరిగే ప్రక్రియ ఇందులో ఇమిడి ఉంది. అందుకే వినాయకచవితి ఎన్నో ప్రత్యేకతలు కలిగిన పర్వదినంగా చూడాలి. ఏటా కొన్ని వేల గణపతి విగ్రహాలను రంగులతో అలంకరించి మండపాల్లో ఏర్పాటు చేయడాన్ని చూస్తుంటాం.

అలాగే ప్రతిఇంట్లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి పూజ నిర్వహిస్తాం. వీటిని మట్టితో తయారుచేస్తేనే మన పర్యావరణం కాపాడకున్నవారం అవుతాం. ఇటీవల కొంతకాలంగా విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్యారిస్, రసాయనాలు కలిగిన రంగులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వినాయక నిమజ్జనంతో ఈ రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చెరువులు, కుంటలు, తటాకాలు, బావులు, నదులకు పర్యావరణ నష్టం జరుగుతోంది. ఈ జలాల్లో నివసించే అనేక జీవకోటి మనుగడకు విఘాతం ఏర్పడుతోంది. అలాగే నీరు కలుషితం అవుతోంది. దీంతో మళ్లీ ఇది వాడడానికి వీలు లేకుండా హైదారాబాద్ హుస్సేన్ సాగర్‌లా కాలుష్య కాసారంగా మారుతున్నాయి. అందుకే ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను వాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. మట్టి గణపతులను తయారుచేయడం ద్వారా కొంతయినా పర్యావరణం కాపాడుకోగలం. ఇంట్లో పూజించే చిన్న చిన్న వినాయక విగ్రహాలను పూర్తిగా మట్టితో తయారుచేస్తే అవి పర్యావరణహితంగా వుంటాయి. నీటిలో సులభంగా కరిగిపోతాయి. ఎలాంటి రంగులను వాడకపోవడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉండదు. ఇక వీధుల్లో ప్రతిష్టించే పెద్ద విగ్రహాల తయారీలోనూ మట్టినీ, పర్యావరణ హితమైన రంగుల్నీ వాడటం ద్వారా పర్యావరణానికి మేలు చేయొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇటువంటి విగ్రహాల వల్ల నిమజ్జన సమయంలో జలాలు కలుషితం కావని చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఈ వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా స్వచ్ఛమైన ప్రకృతి కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. పెద్ద పెద్ద చెరువులూ, తటాకాలూ, కుంటల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసి పర్యావరణానాన్ని దెబ్బతీయకుండా చేస్తే అంతకు మించిన పర్యావరణపరిరక్షణ మరోటి ఉండదు.

# గణపతి సర్వశక్తులకు అధిపతి

## అందుకే ఆయనకు తొలిపూజ

**కాణిపాకం, ఆగస్ట్ 26 :** గణపతి సర్వవిద్యాధి దేవతగా, వేదకాలం నుండి ఆరాధనలందుకుంటున్న దైవం, వేదాలలో స్తుతించబడి, గణాలకు అధిపతియై, శబ్దాలకు రాజుగా, ప్రణవ స్వరూపుడై శబ్దబ్రహ్మగా జ్ఞానానికి ప్రతీకగా నిలిచాడు. సృష్టి ఆదిలో దేవతా గణాల ప్రారంభం కంటే ముందే గణనాథునితో సృష్టి ప్రారంభించినట్లు వినాయక పురాణం తదితర పురాణాలు మనకి సూచిస్తున్నాయి. సృష్టి ప్రారంభానికి ముందు ఒకప్పుడు అమ్మవారు రాక్షసులతో యుద్ధం చేస్తున్నది. ఇంకా మనుషులే పుట్టకముందు అన్నమాట. అమ్మవారు పరమేశ్వరుణ్ణి తలచుకొన్నది. ఆయన అక్కడ ఉన్నారు. వారి చూపులు కలసినవి. ఆ చూపుల కలయికకి విఘ్నేశ్వరుడు పుట్టాడు. అంతటి పూర్వుడాయన. ఆయన పేరు మహాగణపతి. ఆ మహాగణపతి అవతారాలనే ఇప్పుడు మనం ప్రతి కల్పంలోనూ పూజిస్తున్నాం. సమస్త మంత్రాలలోను శక్తికి కారణాలైన బీజాక్షరాలన్నింటిలోకి ముందుగా ఉచ్చరించేదే 'ఓంకారం' అందుచేత ఈ గణపతిని ఓంకార స్వరూపుడిగా వర్ణించారు. విఘ్ననిర్మూలనకై అవతరించి మంగళ స్వరూపుడై సకల మానవాళికి ఆరాధ్యమూర్తియై నిలిచాడు. మహాశక్తి అయిన పార్వతీదేవికి 'ద్వారపాలకుడుగా'గణపతిని పెట్టినట్టు మన పురాణగాథ, దీనిలో అంతరార్థం ఏమిటంటే? మూలాధారంలో కుండలినీశక్తి యోగనిద్రలో ఉంటుంది అని, ఈ కుండలిని శక్తియే మహాశక్తి .అ మూలాధారంలో కుండలిని శక్తిని మేల్కొల పడానికి ప్రవేశించే ద్వారం వద్దనే గణపతి కావలిగా ఉన్నాడు. అంటే గణపతి బీజాక్షరంతో మూలాధారాన్ని చైతన్యవంతం చేస్తే




శక్తిని మేల్కొల్పటం సాధ్యపడు తుంది. భక్తులకు సకల శుభాలను చేకూర్చే వినాయకుడు తాను భక్తుల పాలిట కల్పతరువు అని సూచించకనే సూచిస్తూ ఉంటాడు! ఆయన భంగిమలను కాస్త గమనిస్తే అవుననే అనిపిస్తుంది. చాలా ప్రతిమలలో వినాయకుడు తన ఎడమ కాలుని ముడుచుకుని, కుడిపాదాన్ని కిందకి ఉంచి కనిపిస్తాడు. దీనినే యోగ శాస్త్రంలో లలితాసనం అంటారు. సాక్షాత్తూ జ్ఞానానికి ప్రతిబింబమైన లలితాదేవి కూడా ఈ ఆసనంలోనే కనిపిస్తుంది. భారతీయ ప్రతిమలలో ఇది కాస్త అరుదైనప్పటికీ, బౌద్ధానికి సంబంధించిన ఎన్నో శిల్పాలు ఈ ఆసనాన్ని సూచిస్తుంటాయి. ఒక పక్క ప్రశాంతంగా ఉంటూనే అవసరమైనప్పుడు ఎలాంటి కార్యాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండే తత్వానికి ఈ ఆసనాన్ని ప్రతీకగా భావిస్తారు. కర్మయోగులకు ఈ రెండూ అవసరమే కదా! ఒక పక్క జీవితంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎదుర్కొంటూనే, మనసుని స్థిరంగా నిలుపుకోగలడమే మానవులకి నిజమైన సవాలు. తాను అలాంటి స్థితిలో ఉన్నానని గణేశుడు చెప్పకనే చెబుతున్నాడు. తనను కొలిచే భక్తుల విఘ్నాలను తొలగించి వారిని కూడా పరిపూర్ణమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతానని హామీ ఇస్తున్నాడు. అందుకనే భక్తులు ఎక్కువగా లలితాసనంలో ఉన్న వినాయకునికే పూజలు చేస్తుంటారు.

# గణపతికి అనేకచోట్ల ప్రత్యేక ఆలయాలు

## కాణిపాకంలో వరసిద్ధి వినాయకుడు ముంబై సిద్ధి వినాయకుడి ఆలయం

**చిత్తూరు/ముంబై, ఆగస్ట్ 26 :** వినాయకుడికి ఎన్నో నామాలు ఉన్నట్లే, ఎన్నో రూపాలు కూడా ఉన్నాయి. వినాయకుడి కథ, వినాయక చవితి పూజావిధానం దాదాపు అందరికీ తెలిసినదే. వివిధ రూపాల్లో కొలువుదీరే వినాయకుడికి ప్రత్యేక ఆలయాలు కూడా ఉన్నాయి. వరసిద్ధి వినాయక ఆలయం చిత్తూరు జిల్లా కాణిపాకం గ్రామంలో ఉంది. వరసిద్ధి వినాయకుడు ఇక్కడ స్వయంభువుగా వెలిశాడు. ఈ ఆలయంలో వినాయకుని విగ్రహం నేటికీ బావిలోనే కనిపిస్తుంది. ఈ ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు తమకు ఇష్టమైన పదార్థాన్ని స్వామివారికి వదిలిపెడితే కోరికలు తీరుతాయని నమ్మకం. అలాగే, కాణిపాకం వినాయకుడు సత్య ప్రమాణాల వినాయకుడిగా కూడా ప్రసిద్ధుడు. ఇక్కడ వినాయకుని ఎదుట ప్రమాణం చేసిన వారు సత్యమే పలకాలని, అసత్యం పలికిన వారికి అనర్థాలు తప్పవని కూడా భక్తులు నమ్ముతారు. సికింద్రాబాద్‌లో గణేశ్ ఆలయం ప్రసిద్ధి చెందింది. హైదరాబాద్‌లో అలా నాలుగైదు ఆలయాలు ప్రత్యేకం గా ఉన్నాయి. ఇకపోతే మహారాష్ట్రలోని ముంబైలో వరసిద్ధి వినాయకుడు కూడా బాగా ప్రసిద్ధి. ఇక్కడ వ్యాపారవేత్తలు తమారాధ్య దైవంగా కొలుస్తారు. కేరళలోని మధుర మహాగణపతి ఆలయం ఒకప్పుడు శివాలయం. పరమశివుడు మదరనాథేశ్వరునిగా ఇక్కడ వెలశాడు. స్వయంభువుగా వెలసిన శివలింగానికి తుళురాజులు ఆలయం నిర్మించారు. మదరు అనే వృద్ధురాలు ఈ శివలింగాన్ని కనుగొనడంతో ఆమె పేరిట ఇక్కడి శివుడు మదరనాథేశ్వరునిగా ప్రసిద్ధి పొందాడని ప్రతీతి. మైసూరు



రాజ్యాన్ని పరిపాలించిన టిప్పు సుల్తాను చాలా ఆలయాలపై దాడులు చేసినట్లుగానే ఈ ఆలయంపైనా దాడి చేయడానికి వచ్చాడని చెబుతారు. మూషిక వాహనుడైన వినాయకుడు నెమలి వాహనంపై కనిపించే అరుదైన ఆలయం ఇది. అందుకే ఇక్కడ వెలసిన వినాయకుడు మయూరేశ్వరుడిగా ప్రసిద్ధి చెందాడు. స్థానికులు 'మోరేశ్వర్' అని కూడా అంటారు. మయూరేశ్వరుడు వెలసినందున ఈ క్షేత్రానికి 'మోర్గాంవ్' అనే పేరు వచ్చింది. ఇది మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఉంది. మహారాష్ట్రలో ప్రాచీన వినాయక క్షేత్రాలు ఎనిమిది ఉన్నాయి. వీటిని అష్ట వినాయక క్షేత్రాలని అంటారు. అష్ట వినాయక క్షేత్రాలకు తీర్థయాత్రగా వెళ్లేవారు మోర్గాంవ్‌లోని మయూరేశ్వరుడి దర్శనంతో యాత్రను ప్రారంభించడం ఆనవాయితీ. ఇకపోతే రాజస్థాన్‌లోని రణ్‌థాంబోర్ కోటలో ఉన్న ఈ ఆలయంలోని వినాయకుడిని 'ప్రథమ గణేశ' అని కూడా అంటారు. దేశంలో ఇదే మొట్టమొదటి వినాయక ఆలయంగా భావిస్తారు.

# అక్రమార్జనపై ఉద్యోగుల మక్కువ

## ఏసీబీ కేసులకు చిక్కని వారెందరో పట్టుబడుతున్నా కానరాని మార్పు

**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** ప్రభుత్వ శాఖల్లో అవినీతి వేళ్ళూనుకుంది. రెవెన్యూ శాఖలో పాసుపుస్తకాలు మొదలుకొని ఇతర అన్ని సేవలకు ఉద్యోగులు, అధికారులు లంచం తీసుకుంటున్నారని ఎంతోమంది బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో తెలంగాణలో దాడులు పెరిగాయి. ఫిర్యాదు రావడమే ఆలస్యం... ఏసీబీ స్పందించి వల పన్నుతోంది. ఎందరో చిక్కుతున్నారు, మరెందరో తప్పించుకుం టున్నారు. ప్రజల పన్నులతో జీతాలు పొందుతున్న ఉద్యోగులు ప్రజలకు పనులు చేసి పెట్టకుండా లంచాలు మేస్తున్నారు. రెరా అధికారి బాలకృష్ణ మొదలు అనేకమంది పట్టుబడ్డారు. నీటిపారుదల శాఖలో తిమింగలాలు పట్టుబడ్డాయి. వందల కోట్లను అప్పనంగా సంపాదించినా నాయకులు, ఉద్యోగులు అక్రమాస్తులపై మక్కువ వదలడం లేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా ఏసీబీ కేసులు నిత్యం నమోదవుతూనే ఉన్నాయి. రాజకీయ నాయకులు, అధికారులు బినామీల పేరుతో ఆస్తులు కూడగడుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు ఈ విషయాలను పెద్దగా పట్టించుకోకపోవడం గమనార్హం. రాజకీయ నాయకులు కూడా ఆస్తుల వివరాలు ప్రకటించాల్సి ఉన్నా కొందరు మాత్రమే వెల్లడిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ నాయకులు వారితో పాటు వారి కుటుంబసభ్యుల ఆస్తుల వివరాలు నామినేషన్ సమయంలో అఫిడవిట్‌లో పేర్కొనాల్సి ఉంటుంది. పలు పార్టీల్లో ఉన్న కొందరు ప్రజాప్రతినిధులు ఎన్నికైన తర్వాత అక్రమార్జనతో కోట్లకు పడుగలెత్తారు. గుత్తేదారుల నుంచి పర్సంటేజీలు మొదలుకొని ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకునే వరకు మరీ అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు.

### చేతులు తడపనిదే..

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి రిజిస్ట్రేషన్‌కు మామూల్లు వసూలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇది నిజమని తెలిసినా వారిని ఎవరూ అడ్డుకోవడం లేదు. నిషేధిత ఆస్తులు సైతం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి కొందరు కోట్లు సంపాదించిన ఉదంతాలు ఉన్నాయి. ఈ శాఖలో ఉద్యోగుల బదిలీల్లోనూ అక్రమాలకు పాల్పడిన ఘటనలు మనకు తెలిసిందే. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ, నగరపాలక సంస్థ, పురపాలక శాఖలు, విద్యుత్ శాఖ పరిధిలో జరిగే ప్రతి పనుల్లో అధికారులు, ఉన్నతాధికారులు, నేతలకు పర్సంటేజీలు అందుతాయనేది బహిరంగ రహస్యమే. పోలీసు శాఖలో నెలసరి మద్యం మామూల్లు, కేసుల వ్యవహారాల్లో వసూళ్ల దందా మామూలై పోయిందని బాధితులు వాపోతున్నారు. ఇలా ప్రతీ శాఖలోనూ అవినీతి, అక్రమాలు పలు పంథాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు, ఉన్నతాధికారులు కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. అక్రమాస్తులు కూడగడితే శిక్ష తప్పదని కోర్టు మరోమారు రుజువు చేసినా, అక్రమార్కులు తమ చేతులు తడపనిదే పనులు చేయడం లేదు. మద్య నిషేధ, అబ్కారీ



శాఖలో కానిస్టేబుళ్ల నుంచి ఉన్నతాధికారుల వరకు నెలసరి మామూల్లు పుచ్చుకుంటున్నారు. అక్రమార్కులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని రుజువు చేస్తున్నా, ఉద్యోగుల తీరు మారడం లేదు. ఇకపోతే నాయకులు కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడుతున్నారు. ఇలా అక్రమంగా సంపాదించే ప్రతిఒక్కరూ ఆలోచించాల్సిన తరుణమిది. అక్రమాస్తుల కేసుల్లో పట్టుబడిన వారు ప్రతి జిల్లాలోనూ ఉన్నారు. వీరి కేసులు ప్రస్తుతం న్యాయస్థానాల పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం కేసులన్నీ కోర్టు విచారణలో ఉన్నాయి. పలువురు అవినీతి ఉన్నతాధికారులపై గతంలోనూ కేసులు నమోదయ్యాయి. అయితే అక్రమాస్తుల సంపాదనకు నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు.

### ప్రభుత్వ శాఖల్లో అవినీతి విశ్వరూపం!

ప్రభుత్వ శాఖల్లో అవినీతి విశ్వరూపం దాలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ శాఖలో ఉద్యోగిగా చేరే వ్యక్తి మొదట తన ఆస్తుల వివరాలు ప్రభుత్వానికి తెలియజేయాలి. లేదంటే ఉద్యోగంలో చేరిన తర్వాత వచ్చే మొదటి జనవరి నెలాఖరులోగా తెలియపరచాల్సి ఉంటుంది. లక్ష రూపాయలకు మించి విలువ చేసే బంగారం, వాహనం, ఇతర చరాస్తులు కొన్నట్లయితే ఉన్నతాధికారులకు తెలియజేయాలి. స్తిరాస్తి విషయంలో అడుగుస్థలం కొనుగోలు చేసినా తెలియపరచాల్సిందే. ఇల్లు కట్టుకుంటున్నట్లయితే ముందుగా చెప్పాలి. ఈ నిబంధనలు పాటించకుండా స్థిర, చరాస్తులు కొన్నట్లయితే అవి అక్రమ ఆస్తులుగా పరిగణిస్తారు. అయితే ప్రభుత్వ ఉద్యోగంలో చేరేటప్పుడు ఎవరూ స్థిర, చరాస్తుల వివరాలు ఇవ్వడం లేదు. కొత్తగా సంపాదించిన ఆస్తుల వివరాలు ఏ ఉద్యోగి వెల్లడించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల్లో ఆన్‌లైన్ విధానం అమలు పరచడం ద్వారా అవినీతి తగ్గించే యత్నం చేస్తోంది. అయితే ఎంతవరకు సత్ఫలితం ఇస్తుందో చూడాలి.



# భాగ్యనగరంలో ఉత్సవాలకు ప్రత్యేకత

- ఖైరతాబాద్ గణపతికి పెరుగుతున్న ఆదరణ
- వేలంలో బాలాపూర్ లడ్డూ ప్రత్యేకం

**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** గణేశ్ ఉత్సవాల పేరెత్తగానే మహారాష్ట్ర తరవాత హైదరాబాదే గుర్తుకు వస్తుంది. హైదరాబాద్‌లో ఈ ఉత్సవాలకు అంతటి ఘనత ఉంది. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి. ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించు కునేందుకు ఏటా లక్షల్లో జనం తరలి వస్తారు. ఇక్కడ ఏటా ఓ రకమైన వినాయకుడి ప్రతిమను తయారు చేస్తున్నారు. మట్టి గణపతికి ప్రాధాన్యం పెరిగింది. బాలాపూర్ లడ్డూ వేలానికి ప్రతీక. ఇలా అనేక ప్రత్యేకతలు వినాయక ఉత్సవాల్లో ఉన్నాయి. నిమజ్జనం కూడా జంటనగరాల్లో బహుళ ప్రాచుర్యం పొందింది. హైదరాబాద్‌లోని కొన్ని వినాయక మండపాలలో లంబోదరుడి లడ్డూ ప్రసాదాన్ని కొందరు ముస్లిం, క్రిష్టియన్లూ వేలంపాట ద్వారా దక్కించుకోవడం అందుకు తార్కాణం. అంతేకాదు, చార్మినార్ తదితర ప్రాంతాలలో గణపతి శోభాయాత్ర సమయంలో కొందరు ముస్లింలు ఎదురెళ్లి భక్తులకు మంచినీరు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన సందర్భాలెన్నో. రాజా బహద్దుర్ వేంకటరామారెడ్డి హైదరాబాద్ కొత్వాల్‌గా బాధ్యతలు నిర్వర్తి స్తున్న సమయంలో గణపతి శోభాయాత్రలో చిన్నపాటి సమస్య తలెత్తింది. ఆ సమయంలో ఒక ఉన్నత పోలీసు అధికారిగా ఆయన అనుసరించిన వ్యూహం నేటి పోలీసులకూ ఆదర్శనీయం. గణపతి నిమజ్జనం సమయంలో కొందరు పోలీసులే భక్తులతో గొడవపెట్టు కున్నారు. దాంతో, ఊరేగింపు నడిరోడ్డుపై నిలిచింది. భక్తులు వినాయకుడి శోభాయాత్ర పల్లకిని నడిరోడ్డుపై దింపేశారు. ఆ సంగతి తెలిసి హుటాహుటిన సంఘట నా స్థలానికి చేరుకున్న కొత్వాల్, సమస్యకు కారణమైన పోలీసు జవానులను మందలించారు. అయినా భక్తులు వాదులాట ఆపలేదు. దాంతో వేంకటరామారెడ్డి స్వయంగా వినాయకుని ఊరేగింపు పల్లకిని భుజానికెత్తుకోబోయారు. అప్పుడుగానీ పరిస్థితి సద్దుమణగలేదు. నిమజ్జనం ప్రశాంతంగా సాగింది. ఆ సంఘటన తాలూకూ విషయాలు కొత్వాల్ వేంకటరామారెడ్డి జీవిత చరిత్ర ద్వారా తెలుస్తాయి. నగరంలో వినాయకచవితి జోష్ నెలకొంది. రోడ్ల నిండుగా విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహం వద్ద ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాలు తొలిసారిగా పాతబస్తీలోని శాలిబండ ప్రాంతంలో ప్రారంభ మయ్యాయి. కులమతాలకతీతంగా అందరూ కలిసి గణపతి మండపాలను నెలకొల్పడం, తద్వారా రాజకీయ చర్చలు, స్వాతంత్య స్ఫూర్తిని యువతలో ప్రేరేపించే సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే క్రతువుకు శ్రీకారం జరిగింది. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు, ధనిక, పేద తేడా లేకుండా అందరూ ఆ కార్యక్రమాలు చూసేందుకు పెద్ద ఎత్తున మండపాల వైపు తరలి వస్తారు. ప్రారంభంలో శాలిబండ నుంచి నగరంలో మరికొన్ని ప్రాంతాలకు గణేశ్ ఉత్సవాలు విస్తృతమయ్యాయి. తొమ్మిది రోజుల పాటూ రోజూ సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు జరిపంచేవారు.




## డిప్యూటీ కమిషనర్ ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందజేసిన కైతాపురం జితేందర్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి ని కలిసి ఖాజాగూడలో పెద్ద చెరువు వద్ద సుందరి కరుణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఒక కోనేరు నిర్మించి గణేష్ బతుకమ్మ వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేయాలని వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు కైతాపురం జితేందర్, నక్క శివ కుమార్, కైలా రవీందర్ రెడ్డి ఇతరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులుగా రాజబోయిన శ్రీకాంత్

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులుగా రాజబోయిన శ్రీకాంత్ ముదిరాజు ని నియమించడం జరిగింది ఈ నియమకపత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు సుంకరబోయిన మహేష్ ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి కోలా కరుణాకర్ ముదిరాజ్ చేతుల మీదుగా నియామక పత్రం అందించడం జరిగింది. రాజబోయిన శ్రీకాంత్ మాట్లాడుతూ నాకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర కమిటీ కి ముదిరాజ్ సంఘానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్న అన్నారు జాతి కోసం అహర్నిష్ఠలు కష్టపడుతూ ముదిరాజ్ జాతి ఎదుగుదలకు తోడ్పడుతానని తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరమైన రంజిత్ ముదిరాజ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాషాబోయిన శేఖర్ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అటెమ్ రమేష్ ముదిరాజ్ శ్రీను ఈదుల అనంతరాజ్ ముదిరాజ్ స్వామి ముదిరాజ్ రాజు ముదిరాజ్ పాల్గొన్నారు.



## మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం

### ఈవో సల్వాద్రి మోహన్ బాబు

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** రసాయనాలతో కాకుండా మట్టి విగ్రహాలను వినియోగించి కాలుష్యాన్ని తగ్గించాలని మండలంలోని వేములకొండ మత్స్యగిరి గుట్ట కార్యనిర్వహణాధికారి సల్వాద్రి మోహన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా దేవాదాయశాఖ బీసీ వెల్ఫేర్ శాఖ కాలుష్య నివారణ శాఖ విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## గర్భిణీ స్త్రీలకు అండగా 'అమ్మకు భరోసా' ఉండగా..

### ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం క్షేమం, సురక్షితం అని వలిగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి జలంధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని సంగెం,వర్కట్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మకు భరోసా కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అధికారిగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం క్షేమమని, అలాగే ప్రైవేటు ఆసుపత్రిలో సిజేరియన్ ఆపరేషన్ ల వల్ల ఖర్చుల పాలు కావద్దని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం తీసుకోవాలని ఆయన సూచించారు. సంగెం గ్రామంలోని భవాని అనే గర్భిణీ స్త్రీ ఇంటికి వెళ్లి జాగ్రత్తలు సూచిస్తూ, గర్భిణీ స్త్రీలు పౌష్టికమైన ఆహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ దృఢంగా పుడతారని అన్నారు. కార్యక్ర మంలో డాక్టర్ జ్యోతి, వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ఏఎన్ఎం పాల్గొన్నారు.

## వాన్‌పిక్‌కు హైకోర్టులో చుక్కెదురు




**హైదరాబాద్:** జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ ఛార్జ్‌షీట్ నుంచి తమ సంస్థ పేరును తొలగించాలంటూ వాన్‌పిక్ దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గతంలో వాన్‌పిక్ పేరును సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. ప్రస్తుతం ఈ కేసు నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణలో ఉంది. అయితే, 2022 జులైలో వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను అనుమతించారని వాదించింది. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థా నం మరోసారి పిటిషన్‌ను విచా రించాలని హైకోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో మరోసారి వాన్‌పిక్ ప్రాజెక్టుపై వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. పిటిషన్‌ను కొట్టివేసింది.

# జిల్లాలో యూరియాకు కొరత లేదు

### జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవర్




**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** జిల్లాలో యూరియాకు కొరత లేదని సరిపడా నిల్వలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ తేజాస్ లాల్ పవర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు డీఏఓ శ్రీధర్ రెడ్డి, డి సి ఓ పద్మతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, మండల విస్తరణ అధికారులు మరియు కోపరేటివ్ డివిజనల్ అధికారులతో వెబ్ ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యూరియా సరఫరా పై సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1600 మెట్రిక్ టన్నుల యూరియా ఈ రోజు వరకు అందుబాటులో ఉన్నదని, అదేవిధంగా రాబోవు 2, 3 రోజులలో 1000 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు సరఫరా కానున్నదని కలెక్టర్ తెలిపారు. అవసరం అయిన దానికంటే 29000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా,ఇప్పటికే 31000 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయటం జరిగిందని రైతులు ఎవరు కూడ ఆందోళన చెందవలసిన అవసరం లేదని వారి అవసరాలకు తగ్గట్టుగా నిరంతరం ఈ సీజన్ పూర్తయ్యే వరకు యూరియా సరఫరా చేయటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అందువలన యూరియా దొరకదని ఆందోళనతో రైతులు ఎవరు ముందస్తుగా యూరియా కొనుగోలు చేయరాదని,జిల్లాలో 5600 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉన్నదని, యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు. దీనిని అన్ని రకాల పురుగు మందులలో కలిపి పిచికారి చేయొచ్చని చెప్పారు. వ్యవసాయ అధికారులు నిరంతరం అన్ని సొసైటీలలో మరియు ఎరువుల దుకాణాలలో యూరియా సరఫరాను జాగ్రత్తగా పరిశీలించాలని, కోపరేటివ్ అధికారులు కూడ నిరంతరం యూరియా సరఫరాను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

## యూరియా లభ్యతపై ఆందోళన చెందకుండా

# రైతులకు భరోసా కల్పించాలి

- వారం రోజులలో 1080 మెట్రిక్ టన్నుల యూరియా రానుంది
- నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించాలి
- యూరియా సరిహద్దులు దాటకుండా పోలీస్, వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ
- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదనే భరోసా ఇవ్వాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలో యూరియా లభ్యత, సరిహద్దుల్లో చెక్ పోస్ట్‌ల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రైతులకు యూరియా లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉంచే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గత సంవత్సరం జిల్లాలో 19764 మెట్రిక్ టన్నుల యూరియాను అందించడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా ఇప్పటివరకు 19534 మెట్రిక్ టన్నుల యురియా సరఫరా చేయడం జరిగిందన్నారు. వారం రోజుల్లోగా జిల్లాకు అదనంగా 1080 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని ఆయన తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు యూరియా విక్రయ కేంద్రాల వద్ద ఉంటూ క్షుణ్ణంగా పరిశీలిస్తూ రైతులకు యూరియా అందే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా నుండి యూరియా అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి యూరియా ఇతర ప్రాంతాలకు తరల కుండ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. నానో యూరియాను నేరుగా మొక్కలు, ఆకులపై పిచికారి చేయవచ్చు అనే విషయాన్ని రైతులకు తెలియజేస్తూ వారిని ప్రోత్సహించాలని ఆయన అధికారులకు సూచించారు. ఇప్పటికీ జిల్లాలో 1000 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. నానో యూరియాను ఉపయోగించడం ద్వారా రైతులు సాంప్రదాయ యూరియా ఏరువులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, ఏడిఏ సందీప్ కుమార్, ఏడిలు ప్రసన్న లక్ష్మి, శంకర్ నాయక్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో మట్టి గణపతుల పంపిణీ



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో వినాయక చవితి వేడుకను పురస్కరించుకుని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సుధీర్ , అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి లతో కలిసి అధికారులకు, ఉద్యోగులకు మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగాఅదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12000 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి గణపతి విగ్రహాలను చెరువుల మట్టితో తయారు చేసి చెరువు లోనే నిమజ్జనం చేద్దాం పోస్టర్ ను విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను కాలుష్య నియంత్రణ మండలి ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యత కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర రసాయనిక రంగులతో రూపొందించిన విగ్రహాల కారణంగా జల వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిష్టించి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అధికారి రేణుకా దేవి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ సిధార్థ, జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణ వేణి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

### అదనపు కలెక్టర్, ప్రత్యేక అధికారి డాక్టర్ పర్స రాంబాబు

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ అని ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి డాక్టర్ పర్స రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం సూర్యాపేట మునిసిపల్ కార్యాలయంలో బుధవారం జరగబోయే వినాయక చవితి సందర్భంగా కమిషనర్ హన్మంతరెడ్డి,ఆర్డీవో వేణుమాధవ్ రావు ,జిల్లా ఎస్ సి కార్పొరేషన్ ఇడి శ్రీనివాస్ నాయక్‌తో కలిసి పలువురికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వినాయక చవితి సం దర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పీవోపీ విగ్రహాలను వదిలి మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ఇఇ కిరణ్ కుమార్,డీఇ సత్యారావు,సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్,ఆర్వో కళ్యాణి,టిపిఒ సోమయ్య,పట్టణ వన్ టౌన్ ఎస్ఐ ఏడుకొండలు,ఏఎస్ఐ నరేందర్,మున్సిపల్ మెప్మా సిబ్బంది,వార్డు అధికారులు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



## పోలీస్ కుటుంబాలకు బాసటగా పోలీసు భద్రత స్కీమ్

### కుటుంబాల సంక్షేమానాకి భరోసా : ఎస్పీ నరసింహ

**సూర్యాపేట,రాజ ముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పోలీస్ స్టేషన్ నందు హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న రమేష్ రాథోడ్ అకాలంగా మృతి చెందినారు. మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ రమేష్ కుటుంబానికి పోలీసు భద్రత స్కీం యొక్క నగదు చెక్కు ను జిల్లా యస్.పి నరసింహ ఐపిఎస్ అందజేసినారు. పోలీసు శాఖలో పని చేస్తూ ఆకాలంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలను పోలీసు శాఖ అన్ని విధాలుగా అదుకుంటుందని,దివంగత సిబ్బంది కుటుంబాలకు పోలీసు భద్రత స్కీమ్ బాసటగా నిలుస్తుంది అన్నారు. రమేష్ కుటుంభం యొక్క సంక్షేమానికి కృషి చేస్తామని యస్.పి తెలిపినారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షులు ఎస్ ఐ రామచందర్,బరోసా సెంటర్ మహిళా ఎస్సై మౌనిక,సిబ్బంది ఉన్నారు



## నాతి సవీందర్ కుమార్ గౌడ్‌కు సన్మానం

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర భారీ నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చేతులమీదుగా ఉత్తమ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నాతి సవీందర్ కుమార్ గౌడ్ ను ప్రశంసా పత్రం అందుకున్న సందర్భంగా గౌడ ప్రొఫెషనల్స్ అండ్ అఫీషియల్స్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సవీందర్ కుమార్ గౌడ్ ను జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం గోపా జిల్లా కమిటీ అధ్యక్షులు బూర రాములు గౌడ్ మాట్లాడుతూ బాధితుల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగేలా చేసిన సేవలను గుర్తిస్తూ సవీందర్ కుమార్ కి ప్రశంస పత్రం రావడం అభినందనీయమన్నారు. సీనియర్ న్యాయ వాది,ఒకటో అదనపు కోర్ట్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ న్యాయవాదులు కాలానికి అనుగుణంగా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల పక్షపాతిగా ప్రభుత్వం తరఫున విధులు నిర్వహిస్తానని,తాను అందించిన సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రం రావడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి యరగాని లక్ష్మయ్యగౌడ్, సీనియర్ జర్నలిస్టులు అయితగాని రాంబాబు గౌడ్, భూపతి రాములు గౌడ్ ,నామాల గురుమూర్తి గౌడ్, అంతటి విజయ్ గౌడ్, దోరేపల్లి రమేష్ గౌడ్, బెల్లంకొండ పుల్లయ్య గౌడ్,బొమ్మగాని సైదులు గౌడ్, ఖమ్మంపాటి జానయ్య గౌడ్, భూపతి నారాయణ గౌడ్,చీకూరి. లక్ష్మణ్ గౌడ్,బూర సుధాకర్ గౌడ్, కొండా రమేష్ గౌడ్,యరగాని లక్ష్మీనారాయణ గౌడ్,కొత్త పుల్లయ్య గౌడ్,కోలా సైదులు గౌడ్, కట్ల అంజయ్య గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో

# నిర్మాణాలు చేపట్టొద్దు

### ఆలయ చైర్మన్ కావడపు రాంరెడ్డి

- మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వరరావు, మేడిపల్లి సీఐ గోవిందరెడ్డికి వినతి పత్రాలు అందజేత





**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని మేడిపల్లి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆలయ చైర్మన్ కావడపు రాంరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పీర్జాదిగూడ నగర మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వరరావు, మేడిపల్లి మండల సిఐ గోవిందరెడ్డి లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత కొన్ని సంవత్సరాలుగా ఆలయ ప్రాంగణంలో విభిన్న కులస్తుల సమావేశాలు, వేడుకలు జరుగుతున్నాయని తెలిపారు. ఆ యొక్క స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన తక్షణమే నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. ఆ యొక్క స్థలములో కేంద్ర ప్రభుత్వం చార్జింగ్ పాయింట్ ను నిర్మాణం చేసేందుకు సర్వే జరుగుతున్నట్లుగా సోషల్ మీడియా ద్వారా సమాచారం ఆలయ కమిటీకి అందిందని అన్నారు. గత 20 సంవత్సరాలుగా ఇంతకుముందున్న ప్రభుత్వాలు కానీ అధికారులు కానీ వారి దృష్టికి పెట్రోల్ పంపు, బస్టాండ్, ఇవన్నీ ప్రపోజల్స్ వచ్చిన సర్వే నంబర్ 103 లో ఎండోమెంట్ కి సంబంధించిన స్థలం(4740) చదరపు అడుగులు కాబట్టి ఈ స్థలంలో ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి ఉత్సవాలు, బతుకమ్మ ఉత్సవాలు, దసరా ఉత్సవాల కొరకు ప్రజల అవసరాలకు ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. కానీ ఇట్టి భూమిని గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణానికి ఇవ్వడం జరిగింది. కనుక ఈ యొక్క క్రీడా ప్రాంగణం బోర్డుని తక్షణమే తొలగించి ఇట్టి స్థలాన్ని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి కేటాయించాలని అందులో ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వద్దని దేవస్థానం యొక్క స్థలాన్ని దేవస్థానానికే చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు తవిటి ప్రశాంత్ , బండిరాళ్ల భాస్కర్, లక్ష్మణ్, శ్రీను నాయక్, కవిడె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ వీసా దెబ్బ..

## వేల మంది భారతీయ ట్రక్కు డ్రైవర్లకు అవస్థలు..



**యూఎస్ :** అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఒక్క రోడ్డు ప్రమాదం అక్కడ పని చేయాలనుకొన్న విదేశీ కమర్షియల్ డ్రైవర్ల జీవితాల్లో చీకటి నింపుతోంది. దీనిని సాకుగా చూపించి ట్రంప్ సర్కారు విదేశీ ట్రక్కు డ్రైవర్లకు వర్క్ వీసాలు, కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీని నిలిపివేసింది. అమెరికాలో మోటార్ వాహన రంగంలో స్థిరపడాలని కలలు కన్న వేలాది మంది భారతీయులకు ఇది శాపంగా మారింది. ముఖ్యంగా పంజాబ్, హరియాణా ప్రాంతాల నుంచి డ్రైవర్లు వెళుతుంటారు. అమెరికాలోని రవాణారంగం చాలామంది డ్రైవర్లను ఆకర్షించడానికి ప్రధాన కారణం భారీగా ఆదాయం ఉండటమే. అక్కడ పెద్ద మొత్తంలో వేతనాలు ఇవ్వడంతో పాటు.. సురక్షితమైందిగా భావిస్తారు.

### ఏటా కనీసం రూ. 40 లక్షల ఆదాయం..!

అమెరికాలో డ్రైవర్లకు మైళ్ల ఆధారంగా రేటు చెల్లిస్తుంటారు. ఒక్కో మైలుకు ప్రాంతాన్ని బట్టి 0.60 డాలర్ల నుంచి 0.70 డాలర్ల వరకు గిట్టుబాటు అవుతుంది. ప్రతి డ్రైవర్ రోజుకు 500-600 మైళ్లను సులువుగా ప్రయాణిస్తాడు. ఈ లెక్కన భారతీయ కరెన్సీలో నెలకు రూ.4.2 లక్షల నుంచి రూ.6.7 లక్షల వరకు సంపాదిస్తారు. కొన్ని సంస్థలు మాత్రం డ్రైవర్లకు గంటల చొప్పున లెక్కగట్టి ఇస్తారు. గంటకు రూ.1,680-రూ.2,520 వరకు ఇస్తారు. దీనిలో అనుభవం, లొకేషన్, యజమాని వంటి స్వల్ప మార్పులు ఉంటాయి. సగటున ఏటా ఒక డ్రైవర్ రూ.40 లక్షలు సంపాదిస్తాడు. ఇక వాల్‌మార్ట్, అమెజాన్ వంటి కంపెనీలు అయితే సీజనల్ డ్రైవర్లకు ఏటా రూ.92 లక్షల వరకు చెల్లిస్తాయి.

### డ్రైవర్లకు తీవ్రమైన కొరత..

అమెరికాలో ట్రక్కు డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉంది. భారత్‌లోని పంజాబ్ నుంచి యువత ఎక్కువగా అక్కడికి వెళ్లి డ్రైవర్లుగా స్థిరపడుతున్నారు. నార్త్ అమెరికన్ పంజాబీ ట్రక్కింగ్ అసోసియేషన్‌లో 1,400 మంది సభ్యులు ఉన్నారు. వీరికి మొత్తం 9,000 ట్రక్కులు ఉన్నాయి. దీని సీఈవో రామన్ దిల్లాన్ ఓ పత్రికతో మాట్లాడుతూ అమెరికాలో డ్రైవర్ల కొరతను పంజాబీలు భర్తీ చేస్తున్నారని చెప్పారు. అమెరికా ట్రాన్స్‌పోర్టు రంగ నిపుణుడు బ్రెంట్ అలైన్ కూడా విదేశీ డ్రైవర్లపై వీసా బ్యాన్ స్వల్పకాలమే ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కొత్త డ్రైవర్లకు శారీరక ధారుఢ్య పరీక్ష, సరైన శిక్షణ ఇచ్చి లైసెన్స్‌లు జారీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుతం అమెరికాలో అవసరమైన దానికంటే చాలా తక్కువ కమర్షియల్ డ్రైవర్లు ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. 2025 బడ్జెట్ సంవత్సరంలో అమెరికాలో విదేశీ డ్రైవర్లకు 1,490 హెచ్-2బీ వీసాలను జారీ చేశారు. అంతకుముందు ఏడాదికి 1,400 మాత్రమే ఇచ్చారు.

### ఎంతమంది భారతీయులపై ప్రభావం..?

అమెరికాలో 2021 లెక్కల ప్రకారం 7.2 లక్షల మంది విదేశీ కమర్షియల్ డ్రైవర్లు ఉన్నారు. అమెరికా ట్రక్కింగ్ రంగంలో ఇది 18 శాతానికి సమానం. భారత్‌లోని పంజాబ్, హరియాణా నుంచి పెద్దసంఖ్యలో యువకులు ఇక్కడికి వస్తుంటారు. 2018లో గణంకాల ప్రకారం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 30,000 మంది భారతీయ సిక్కులు ట్రక్కింగ్ రంగంలో చేరారంటే అర్థం చేసుకోవచ్చు. తాజాగా ట్రంప్ సర్కారు చర్యలతో విదేశీ డ్రైవర్లకు వీసాలు, వర్క్‌పర్మిట్లు, కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్ జారీ నిలిచిపోయింది. చట్టపరమైన అనుమతులతో ఇప్పటికే పనిచేస్తున్న వారికి వచ్చిన ఇబ్బందులు ఏమీ లేకపోయినా.. వీసా పునరుద్ధరణ సమయాల్లో మాత్రం చిక్కులు తప్పేలా లేవు. దీంతో వేల మంది భారతీయులు భవిష్యత్తులో



# పవర్‌ఫుల్ షో..

## మోదీ, పుతిన్‌ను స్వయంగా ఆహ్వానించనున్న జిన్‌పింగ్

**తియాంజిన్ :** ఆగస్టు చివర్లో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకార సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ చైనా వెళ్తున్నారు. ఈ సదస్సు సందర్భంగా మోదీతోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా ఆహ్వానించనున్నారట. అమెరికా టారిఫ్‌ల వేళ.. గ్లోబల్ సౌత్ దేశాలకు (వర్ధమాన దేశాలు) సంఘీభావంగా శక్తివంతమైన ప్రదర్శనలో భాగంగానే ఈ చర్య ఉండనుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మోదీ, పుతిన్‌తో పాటు మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల నేతలకు ఈ ఎస్‌సీఓ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ ఒకటి మధ్య తియాంజిన్ వేదికగా ఈ సదస్సు జరగనుంది. ప్రధాని మోదీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. అనంతరం చైనా అధ్యక్షుడు 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ భేటీ అయిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతోన్న వేళ.. మోదీ చైనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సుంకాలను డ్రాగన్ ఖండించింది. వాణిజ్య, సుంకాల యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తామని ప్రకటించింది. మరోపక్క దిల్లీలోని రష్యా రాయబారి మాట్లాడుతూ.. భారత్, చైనాతో కలిపి త్వరలో త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని భావిస్తున్నట్లు మీడియాతో వెల్లడించారు. ఆ సదస్సు వేళ ఈ ముగ్గురు నేతల మధ్య సమావేశం జరగొచ్చని తెలుస్తోంది. కాగా.."చైనా, ఇరాన్, రష్యా..ఇప్పుడు భారత్‌పై వాషింగ్టన్ తీసుకుంటున్న చర్యలు ఎలాంటి ప్రభావం చూపలేదు. ఈ తరుణంలో అమెరికా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ క్రమం ఎలా ఉండనుందో తెలియజేసేందుకు జిన్‌పింగ్ ఈ సదస్సును ఉపయోగించుకోవాలని అనుకుంటున్నారు" అని చైనా గ్లోబల్ సౌత్ ప్రాజెక్ట్ ఎడిటర్ ఇన్ చీఫ్ ఎరిక్ ఒలాండర్ అభిప్రాయపడ్డారు. ఎస్‌సీఓ చరిత్రలో ఇదే భారీ సమావేశంగా నిలుస్తుందని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఇప్పటికే వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.


# చైనా విద్యార్థులకు గేట్లు ఎత్తేస్తాం

## ట్రంప్ ప్రకటనతో గందరగోళం



**చైనా :** చైనా విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ద్వంద్వ వైఖరి ఆశ్చర్యపరుస్తోంది. ఓ వైపు టారిఫ్‌లపై బీజింగ్‌కు వార్నింగ్ ఇస్తూ వాణిజ్య యుద్ధానికి కాలుదువ్వుతూనే.. చైనా విద్యార్థులకు అమెరికా తలుపులు తెరుస్తున్నారు. ఏకంగా 6 లక్షల మంది చైనీస్ విద్యార్థులను అగ్రరాజ్యానికి ఆహ్వానిస్తున్నారు. ట్రంప్ తీరు సొంత పార్టీ నేతలను అసహనానికి గురిచేస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులు, విదేశీ విద్యార్థుల విషయంలో కఠిన నిబంధనలు అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా చైనాలో కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన వారు, పరిశోధన రంగంలో ఉన్నవారికి వీసాలు రద్దు చేస్తామని బహిరంగంగానే హెచ్చరికలు చేశారు. భారత్ సహా ఇతర దేశాల విద్యార్థుల వీసాల ప్రక్రియను కూడా కఠినతరం చేశారు. ఈ క్రమంలోనే తాజాగా చైనా విషయంలో ట్రంప్ యూటర్న్ తీసుకోవడం గమనార్హం. తాజాగా వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "చైనీస్ విద్యార్థులను అమెరికాలోకి మేం అనుమతించబోమంటూ వచ్చిన వార్తలను విన్నాం. కానీ, మేం వారికి మన విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించాలనుకుంటున్నాం. మనకు అది చాలా ముఖ్యం కూడా. 6 లక్షల మంది చైనా విద్యార్థులు అమెరికాకు వచ్చేందుకు అనుమతిస్తాం. ఆ దేశంతో సంబంధాలు మెరుగుపరుచుకోవాలను కుంటున్నాం" అని ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా వర్సిటీల్లో దాదాపు 2.70లక్షల మంది చైనీస్ విద్యార్థులు చదువుకుంటున్నారు. ట్రంప్ తాజా ప్రకటన రాజకీయ వివాదానికి దారితీసింది. ఆయన నిర్ణయాన్ని సొంత పార్టీ నేతలు, మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) మద్దతుదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చైనా విద్యార్థులకు అవకాశం కల్పించడం అంటే.. 'అమెరికా ఫస్ట్' అజెండాకు ద్రోహం చేసినట్లేనని మండిపడుతున్నారు. అమెరికా విద్యార్థులకు రావాల్సిన అవకాశాలను చైనీయులకు ఎలా కల్పిస్తారని ప్రశ్నిస్తు న్నారు. అయితే, ట్రంప్ నిర్ణయాన్ని అధ్యక్షుడి యంత్రాంగం సమర్థించింది. "చైనీస్ విద్యార్థులను అనుమతించకపోతే.. అమెరికాలో 15శాతం యూనివర్సిటీలకు పని లేకుండా పోతుంది. ఆర్థిక విధానాలను పరిగణనలోకి తీసుకునే ట్రంప్ హేతుబద్ధంగా వ్యవహరించారు" అని అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ తెలిపారు.

# ఇరాన్ జాతి విద్వేషపూరిత దాడులకు పాల్పడుతోంది : ఆస్ట్రేలియా ప్రధాని



**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియాలో జరుగుతున్న వరుస జాత్యహంకార దాడులపై ఆ దేశ ప్రధాని ఆంథోని అల్బనీస్ ఆందోళన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా ఆస్ట్రేలియాలో యూదులపై జరుగుతున్న దాడులకు ఇరాన్ కారణమని ఆరోపించారు. జాతి విద్వేషపూరిత దాడులకు పాల్పడుతూ.. ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇందుకుగాను ఇరాన్ రాయబారిని తమ దేశం నుంచి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. సిడ్నీలోని రెస్టారెంట్, మెల్‌బోర్న్‌లోని ప్రార్థనా స్థలంపై దాడులకు ప్రయత్నించిన వారికి ఇరాన్ నేతలతో సంబంధాలు ఉన్నట్లు ఆస్ట్రేలియా నిఘా వర్గాలు తమ దర్యాప్తులో గుర్తించినట్లు ప్రధాని పేర్కొన్నారు. 2023లో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ప్రారంభమైనప్పటినుంచి ఆస్ట్రేలియాలోని పలు నగరాల్లో జాతి విద్వేషపూరిత దాడులు ఆందోళనకరంగా మారాయన్నారు. వీటిలో పలు దాడులను ఇరాన్ స్వయంగా పర్యవేక్షించినట్లు తమ నిఘా సంస్థలు గుర్తించినప్పటికీ.. ఆ దేశం తమ ప్రమేయాన్ని దాచిపెట్టడానికి ప్రయత్నిస్తోందని ఆస్ట్రేలియా ప్రధాని ఆరోపించారు.

# భవిష్యత్తులో యుద్ధాలకు
# ఆ నాలుగే కారణాలు : అనిల్ చౌహాన్




**న్యూఢిల్లీ :** ప్రపంచదేశాల మధ్య నెలకొంటున్న ఉద్రిక్తతలపై చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ఎప్పటికీ శాంతి, సుస్థిరత, భద్రతకు కట్టుబడి ఉంటుందని.. అయితే దానిని ఆసరాగా చేసుకొని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. గతంలో జరిగే యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు చాలా వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. గతంలో వ్యతిరేక భావజాలం, భూభాగాల స్వాధీనం చేసుకొనేందుకు చేసే యుద్ధాలు అందరి కళ్లకు కనిపించేవని.. ప్రస్తుతం కొత్తకొత్త వ్యూహాలతో దేశాలు పరస్పరం యుద్ధ వాతావరణాన్ని సృష్టించుకుంటున్నాయన్నారు.
భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలకు నాలుగు కారణాలు ఉంటాయని అనిల్ చౌహాన్ పేర్కొన్నారు.

- వారి వారి రాజకీయ లక్ష్యాలను చేరుకోవడం కోసం ఆయా దేశాలు పరస్పరం బల ప్రయోగానికి దిగడం
- పోటీ, సంక్షోభం, ఘర్షణ వంటి విషయాల్లో శాంతికి, యుద్ధానికి మధ్య సరైన తేడా తెలుసుకోలేకపోవడం
- ప్రజల అవసరాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం
- విజయాన్ని నిర్ణయించే కొలమానాల్లో వస్తున్న మార్పులు

ఇలాంటి వాటివల్లే భవిష్యత్తులో దేశాల మధ్య యుద్ధాలు వచ్చే అవకాశం ఉందన్నారు. 1971లో పాక్‌తో జరిగిన ఘర్షణల్లో భారత్ 95 వేల మంది పాకిస్థానీయులను బంధించిందని.. కానీ ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో ఆయుధాల రేంజ్, దాడుల ప్రభావాలను కొలమానంగా తీసుకున్నామని అనిల్ చౌహాన్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ నుంచి నేర్చుకున్న పాఠాలతో ఆధునిక ఘర్షణలను ఎదుర్కోవడానికి భారత్ సమాయత్తమవుతుందని అనిల్ చౌహాన్ తెలిపారు. ఇందుకోసం త్రివిధ దళాలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. మనపై దాడి చేస్తే దాని ప్రభావం ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం మొత్తం చూసిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అప్పుడే అయిపోలేదని, ఎప్పటికీ కొనసాగుతుందన్నారు. రక్షణ వ్యవస్థలను, ఆయుధశక్తిని మరింత బలవంతం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడాలంటే 'శశాస్త్ర'.. 'సురక్షిత'..'ఆత్మనిర్భర్'గా మారడం ఎంత అవసరమో ప్రజల సైద్ధాంతికపరమైన ఆలోచనలు.. కార్యాచరణల్లోనూ మార్పు తీసుకురావడం అంతే అవసరమని సీడీఎస్ సూచించారు. అప్పుడే భవిష్యత్తులో ఎదురయ్యే భద్రతాపరమైన సవాళ్లను వేగంగా, నిర్ణయాత్మకంగా ఎదుర్కోగలమని అన్నారు.

# బిహార్ 'ఓట్ల చోరీ' విమర్శలు..

## ప్రజాభిప్రాయం కోరనున్న ఈసీ




**న్యూఢిల్లీ :** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సర్కారు ఎన్నికల సంఘంతో కుమ్మక్కై బిహార్ ప్రజల ఓట్లను దొంగిలించే ప్రయత్నాలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము చేపట్టిన బిహార్ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన వివిధ అంశాలపై తమ అభిప్రాయం తెలపాలని రాష్ట్ర ప్రజలను కోరేందుకు పోల్‌ప్యానల్ ఐదు ప్రశ్నలను సిద్ధం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అవి

- ఓటర్ల జాబితాలను సవరించి, విస్తృతంగా పరిశీలించాలా?
- చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలా?
- రెండు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల పేర్లను ఒకదగ్గరి నుంచి తొలగించాలా?
- ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన ఓటర్లను జాబితా నుంచి మినహాయించాలా?
- విదేశీయులు, ఇతర రాష్ట్రాల ప్రజల ఓటు హక్కును తిరస్కరించాలా?

ఈ ప్రశ్నల ఆధారంగా బిహార్ వ్యాప్తంగా సర్వే చేసి ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడానికి ఎన్నికల కమిషన్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బిహార్‌లో ఓటరు జాబితా నుంచి దాదాపు 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఈసీ ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. గుజరాత్ వ్యక్తులు బిహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని, ప్రాణాలతో ఉన్న వారిని చనిపోయినట్లుగా పేర్కొంటూ వారిని జాబితా నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నాయి. తొలగించిన ఓటర్ల పేర్లను వెల్లడించాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు సుప్రీం కోర్టులో పిటిషన్లు వేశాయి. వీటిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఎస్‌ఐఆర్ కింద తొలగించిన 65 లక్షల మంది పేర్లను వెల్లడించాలని ఈసీకి సూచించింది.




# బిహార్ ఎన్నికల ప్రకటనకు ముందే..

## భాజపా కొత్త అధ్యక్షుడి ఎన్నిక

**న్యూఢిల్లీ :** భాజపా నూతన సారథి ఎన్నికకు ఆ పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే పలు కారణాలతో ఎన్నిక ఆలస్యం కావడంతో.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ ప్రకటనకు ముందే ఈ నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ విషయంలో ఇప్పటికే పార్టీ అగ్రనాయకుల మధ్య సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక తర్వాత నూతన సారథి ఎంపికపై భాజపా వేగం పెంచనుందని.. ఈ ఎంపికకు సంబంధించి ఇప్పటికే కొంతమంది వ్యక్తుల పేర్లను పార్టీ అధినేతలు పరిశీలించినట్లు వివరించారు. ఇక, ఈ జాతీయ అధ్యక్ష పదవిని మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అందులో ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ భాజపా ఎంపీ పురందేశ్వరీతో సహా పలువురి పేర్లు వినిపించాయి. భాజపా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి సామాజిక సమీకరణాలను కాకుండా పార్టీని బలోపేతం చేయగలిగే నాయకుడిని ఎన్నుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. భాజపా సంస్థాగత ఎన్నికలు ప్రతి మూడేళ్లకోసారి జరుగుతుంటాయి. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 2019 నుంచి ఆ పదవిలో కొనసాగుతున్నారు. ఆయన రెండో టర్మ్ 2024 జూన్‌తో ముగిసినప్పటికీ.. ప్రస్తుతం ఆయన కేంద్రమంత్రిగా, పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతల్లో కొనసాగుతున్నారు. భాజపా నూతన అధ్యక్షుడి ఎన్నిక చేపట్టాలంటే.. 50శాతం రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తికావడం తప్పనిసరి. దీనికిముందు బూత్, మండల, జిల్లా స్థాయిలకు ఎన్నికలు నిర్వహించాలి. అయితే, ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ హరియాణా, ఝూరండ్, మహారాష్ట్ర, దిల్లీ వంటి కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత పార్లమెంటు సమావేశాలు ఉండటంతో జాప్యం చోటుచేసుకుంది.




# పాక్ గూఢచారి మోతీరామ్‌కు భారీ నెట్‌వర్క్

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారం చేరవేస్తూ దొరికిపోయిన సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మోతీరామ్ జాట్‌కు పెద్దసంఖ్యలో మన సైన్యం, పారామిలటరీ, ప్రభుత్వ అధికారులతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అతడి ఫోన్‌లో 15 మంది నంబర్లను దర్యాప్తు బృందం గుర్తించిందని ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. వీరిలో నలుగురు ఆర్మీ, నలుగురు పారామిలటరీ సిబ్బంది కాగా.. మిగిలినవారు ప్రభుత్వ అధికారులుగా తేలారు. జాట్‌ను మే 27న ఎన్ఐఏ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తు బృందాలు ప్రస్తుతం జాట్ ఫోన్‌ను విశ్లేషిస్తున్నాయి. దీనినుంచి అతడు ఇంటర్నెట్ కాల్స్ కూడా చేసినట్లు తెలుస్తోంది. అతడు పాకిస్థాన్‌లో సలీం అనే ఆపరేటివ్‌తో టచ్‌లో ఉన్నాడు. జాట్‌తో మాట్లాడేందుకు వాడే ఫోన్‌లోని సిమ్‌కార్డ్‌ను కోల్‌కతా నుంచి ఓ వ్యక్తి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దాని యాక్టివేషన్ ఓటీపీని కూడా అతడు లాహోర్‌లోని పాక్ ఆపరేటివ్‌తో పంచుకొన్నాడు. సదరు కోల్‌కతా వ్యక్తి పాక్ జాతీయురాలిని పెళ్లి చేసుకొన్నాడు. ఆ తర్వాత అక్కడికి వెళ్లి స్థిరపడ్డాడు. ఏటా రెండుసార్లు కోల్‌కతా వెళ్లి వస్తుంటాడని గుర్తించారు. ఇక మోతీరామ్ జాట్ నుంచి అత్యంత సున్నితమైన సమాచార పత్రాలను సదరు లాహోర్ ఆపరేటివ్ తెప్పించుకొన్నాడు. ఇందుకోసం అత్యధికంగా రూ.12,000 వరకు చెల్లించాడు. ఆ డబ్బు భారత్‌లోని దిల్లీ, మహారాష్ట్ర, హరియాణ, యూపీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, వెస్ట్‌బెంగాల్‌లోని వివిధ ఖాతాల నుంచి జమయ్యేవి. ఈ నగదు పంపించే వారిలో ఒకరి పేరు షెహజాద్‌గా గుర్తించారు. అతడిని యూపీ పోలీసులు మేలోనే అరెస్టు చేశారు. అతడు పాకిస్థాన్ నుంచి దుస్తులు, సుగంధ ద్రవ్యాలు, కాస్మోటిక్స్ స్మగ్లింగ్ చేసి విక్రయించేవాడు. అయితే షెహజాద్ వాదన భిన్నంగా ఉంది. తాను రైల్లో దిల్లీ నుంచి పంజాబ్ వెళుతున్న సమయంలో తోటి ప్రయాణికుడు ఒకరు జాట్ నెంబర్‌కు రూ.3,500 పంపాల్సిందిగా కోరి.. తనకు ఆ మొత్తాన్ని నగదు రూపంలో ఇచ్చాడని చెబుతున్నాడు.

# మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం.. నలుగురి అరెస్ట్



**హైదరాబాద్ :** సూరారంలోని మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను తెలంగాణ పోలీసు ప్రత్యేక దళం ఈగల్ టీమ్ అరెస్టు చేసింది. నిందితుల వద్ద నుంచి 1.15 కేజీల గంజాయి, 45గ్రాముల ఓజీ వీడ్‌తో పాటు ప్యాకింగ్ సామగ్రి, డిజిటల్ తూకం యంత్రం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సూరారం, జీడిమెట్ల, మహీంద్ర యూనివర్సిటీ వద్ద దాడులు నిర్వహించి విద్యార్థులు మహ్మద్ అషార్ జావీద్‌ఖాన్, నేవీల్ టాంగ్ బ్రామ్‌తో పాటు జీడిమెట్లకి చెందిన అంబటి గణేశ్, శివకుమార్‌లను అరెస్టు చేశారు. నిందితుల ఫోన్లు పరిశీలించగా.. దాదాపు 50మంది డ్రగ్స్ కొనుగోలు దారుల సమాచారం లభించిందని పోలీసులు తెలిపారు. యూనివర్సిటీ హాస్టల్ పరిసరాల్లో సేకరించిన సమాచారం మేరకు ఇద్దరు విద్యార్థులు డ్రగ్స్ అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు.

# భారత్‌లో యాపిల్ నాలుగో స్టోర్.. ఎక్కడంటే?



ప్రముఖ టెక్ సంస్థ యాపిల్ భారత్‌లో తయారీ, విక్రయ కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తోంది. మన దేశంలో నాలుగో యాపిల్ స్టోర్‌ను ఏర్పాటుచేయనున్నట్లు మంగళవారం ప్రకటించింది. మహారాష్ట్రలోని పుణెకు చెందిన కొరెగావ్ పార్క్‌లో సెప్టెంబర్ 4న దీనిని ప్రారంభించనుంది. అలాగే స్టోర్‌కు సంబంధించిన తొలి చిత్రమూ విడుదలైంది. బెంగళూరులోని స్టోర్ మాదిరిగానే పుణెలోని స్టోర్‌ను కూడా నెమలి కళాకృతితో తీర్చిదిద్దారు. ఈ స్టోర్ 10వేల చదరపు అడుగుల వైశాల్యంలో విస్తరించి ఉంటుందని తెలుస్తోంది. కొత్త ఐఫోన్ 17 లాంచ్ కానున్న నేపథ్యంలో ఈ ప్రారంభంపై ప్రకటన వచ్చింది. ఇప్పటికే ముంబయి, దిల్లీ, బెంగళూరులో స్టోర్లు ఉన్నాయి. భారత్‌లో వ్యాపార వృద్ధికి ఇంకా భారీ అవకాశాలున్నాయని గతంలో వ్యాఖ్యానించిన యాపిల్ సీఈఓ టిమ్‌కుక్.. అందుకు అనుగుణంగా దేశంలో నాలుగు రిటైల్ స్టోర్లు నెలకొల్పుతామని చెప్పిన సంగతి తెలిసిందే. త్వరలో విడుదల కాబోయే ఐఫోన్ 17 మోడళ్లన్నింటినీ (ప్రో వెర్షన్లు సహా) దేశంలోనే తయారుచేయాలని యాపిల్ నిర్ణయించింది. చైనా మీద ఆధారపడడాన్ని తగ్గించి, అమెరికా కు ఎగుమతులపై టారిఫ్ రిస్క్‌లను తప్పించుకోవడానికి యాపిల్ ఈ వ్యూహాత్మక ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారత్ నుంచి అమెరికాకు ఐఫోన్ ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. యాపిల్ రాబోయే అన్ని ఐఫోన్ 17 మోడళ్లను భారత్‌లోని ఐదు ప్లాంట్లలో చేపట్టనుంది. విడుదలకు ముందే ప్రో వెర్షన్లు సహా అన్ని కొత్త ఐఫోన్ మోడళ్లను భారత్‌లోనే తయారుచేయడం ఇదే మొదటిసారి.






## టారిఫ్‌ల ముందు మార్కెట్లు ఢమాల్..


**ముంబయి:** ట్రంప్ టారిఫ్‌ల డెడ్‌లైన్‌కు ముందు దేశీయ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. మరికొద్ది గంటల్లో భారత్‌పై అదనపు సుంకాలు అమల్లోకి రానుండటం, అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో సూచీలు మంగళవారం కుప్పకూలాయి. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఏకంగా 850 పాయింట్లు దిగజారగా.. నిఫ్టీ 24,700 స్థాయికి పడిపోయింది. టారిఫ్‌ల ఆందోళనలతో ఉదయం నుంచే సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. 81,377.39 పాయింట్ల వద్ద ట్రేడింగ్‌ను మొదలుపెట్టిన సెన్సెక్స్ ఆద్యంతం నష్టాల్లోనే సాగింది. ఒక దశలో 80,685.98 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయిన సూచీ.. మార్కెట్ ముగిసే సమయానికి 849.37 పాయింట్లు దిగజారి 80,786.54 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 255.70 పాయింట్లు కోల్పోయి 24,712.05 వద్ద ముగిసింది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఐషర్ మోటార్స్, మారుతి సుజుకీ, హిందుస్థాన్ యునిలివర్, నెస్లే ఇండియా, ఐటీసీ షేర్లు రాణించాయి. రంగాల వారీగా చూస్తే.. ఎఫ్‌ఎంసీజీ మినహా అన్ని రంగాల సూచీలు పతనమయ్యాయి. లోహ, బ్యాంకింగ్, ఫార్మా, టెలికాం సూచీలు 1-2శాతం మేర కుంగాయి.

### మార్కెట్ల పతనానికి కారణాలివే..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే అగ్రరాజ్యం నోటీసులు జారీ చేసింది. దీంతో టారిఫ్‌ల ప్రభావం ఉండే రంగాల్లో ఆందోళన నెలకొంది. ఫెడ్ గవర్నర్‌ను ట్రంప్ తొలగించడంతో అమెరికా మార్కెట్లు పతనమయ్యాయి. అటు ఆసియా-పసిఫిక్ మార్కెట్లు కూడా నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపైనా పడింది. సోమవారం నాటి ట్రేడింగ్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.2,466.24 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు. ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా టారిఫ్ ఆందోళనల నేపథ్యంలో రూపాయి విలువ పతనమైంది. నేటి ట్రేడింగ్‌లో 13 పైసలు క్షీణించి 87.69 వద్ద స్థిరపడింది.

## రూ.100తో కంపెనీ షేర్లు కొని.. తాజ్‌లో రూ.3,000 భోజనం తిని..

### : వైరల్‌గా ఓ సీఏ పోస్టు



ఓ కంపెనీలో షేర్ కొని ఏటా ఫైవ్‌స్టార్ హోటల్‌లో భోజనం చేసేవాడినంటూ ఓ వ్యక్తి చేసిన పోస్టు ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. దినేష్ జ్ఞాని అనే ఛార్టెడ్ అకౌంటెంట్ రెండ్రోజుల క్రితం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. "ఆ నాటి గోల్డెన్ డేస్‌ను మిస్ అవుతున్నాను. ఇండియన్ హోటల్స్‌కు చెందిన ఒక షేర్‌ను రూ.100 చెల్లించి కొనుగోలు చేశాను. ముంబయి తాజ్‌మహల్ ప్యాలెస్‌లో జరిగే ఆ సంస్థ వార్షిక సమావేశానికి హాజరయ్యాను. రూ.3000 విలువ చేసే లంచ్ బఫెట్‌ను ఫ్రీగా తిన్నాను. నిజంగా విలువైన పెట్టుబడి" అని పేర్కొన్నాడు. నాడు తాజ్‌లో బస, ఫుడ్ కూపన్స్ మర్చిపోలేనని దినేష్ పేర్కొన్నారు. వికాస్ ప్రాపర్టీస్ వాటాలు కొన్నప్పుడు.. 2020లో ఐటీసీ జోధ్‌పుర్‌లో ఒక రాత్రి బస, భోజనం ఉచితంగా లభించిందని ఓ పత్రాన్ని పోస్టు చేశారు. కొవిడ్ వ్యాప్తి తర్వాత అన్ని ఏజీఎంలు ఆన్‌లైన్‌కు మారిపోయాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారడంతో చాలా మంది ఆయన పోస్టు కింద చాలా మంది ఏజీఎంల్లో తమకు లభించిన గిఫ్ట్‌లు, కూపన్ల అనుభవాలను పంచుకొన్నారు. కేవలం కొన్ని ట్రైడెంట్ షేర్లు ఉన్నందుకే తనకు బెడ్‌రోల్స్ వచ్చాయని ఓ యూజర్ వెల్లడించారు.




## 100 దేశాలకు ఎగుమతి లక్ష్యం..

### మారుతీ సుజుకీ ఈవీ కారును ప్రారంభించిన మోదీ

గుజరాత్ : దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఈక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌లోని హన్సల్‌పుర్ మారుతీసుజుకీ మోటార్ ప్లాంట్‌లో రెండు కీలక ప్రాజెక్టులు ప్రారంభించారు. మారుతీ సుజుకీ తొలికారు ఇ-విటారాతో పాటు హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ ఉత్పత్తి చేసే తొలి ప్లాంట్‌కు జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జపాన్ రాయబారి కీచీ ఒనో పాల్గొన్నారు. "భారత్ స్వావలంబన సాధించేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు ఇది ప్రత్యేకమైన రోజు. ఇక్కడ ఉత్పత్తి కానున్న కార్లు 100 దేశాలకు ఎగుమతి కానున్నాయి" అని ఈ కార్యక్రమానికి ముందు మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇ-విటారా తొలికారు యూకేకు ఎగుమతి కానుంది. తొషిబా, డెన్సో, సుజుకీసంస్థల భాగస్వామ్యంతో ఆ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ తయారుకానున్నాయి. దాంతో 80 శాతం బ్యాటరీ దేశీయంగా సిద్ధం కానుంది. ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ తన తొలి విద్యుత్ కారు ఇ-విటారా జనవరిలో ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ కారును 100కు పైగా దేశాలకు ఎగుమతి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా భారత్‌ను గ్లోబల్ ప్రొడక్షన్ హబ్‌గా తీర్చిదిద్దాలనుకుంటున్నట్లు సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ అప్పుడు వెల్లడించారు. మారుతీ సుజుకీ ఇ-విటారా రెండు బ్యాటరీ ఆప్షన్లతో వస్తోంది.

### 100 సిటీల్లో ఛార్జింగ్ పాయింట్లు

భారత్‌లో ఇ-విటారా తయారీకి రూ.2,100 కోట్లు వెచ్చించినట్లు మారుతీ సుజుకీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ హిసాషి టకేయుచి గతంలో తెలిపారు. మారుతీ సుజుకీ ఈవీలు కొనుగోలు చేసేవారికి స్మార్ట్ హోమ్ ఛార్జర్, ఇన్‌స్టలేషన్ సపోర్ట్‌ను అందించనున్నట్లు తెలిపారు. తొలిదశలో 100 ప్రధాన నగరాల్లో ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయాలను అందించనున్నట్లు వివరించారు. ప్రతి 5-10 కిలోమీటర్లకు మారుతీ సుజుకీ ఛార్జింగ్ పాయింట్లను అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు.



## విరాట్ కోహ్లీ పరుగులు చేయడానికి పుజారా సాయం చేశాడు

### రవిచంద్రన్ అశ్విన్

టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్.. తాజాగా తన క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన ఛతేశ్వర్ పుజారాకు అభినందనలు తెలిపాడు. అతడు మూడోస్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఎన్నో వీరోచిత ఇన్నింగ్స్‌లు ఆడాడాని కొనియాడాడు. అలాగే.. విరాట్ కోహ్లీ పరుగులు చేయడంలోనూ సహాయ సహకారాలు అందించాడని విశ్లేషించాడు. 'ఛతేశ్వర్ పుజారా టీమ్‌ఇండియా తరఫున టెస్టుల్లో మూడోస్థానంలో అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా.. విరాట్ కోహ్లీ పరుగులు చేయడంలోనూ అతడు కీలకంగా వ్యవహరించాడు. దీనికి నా దగ్గర మంచి ఉదాహరణ కూడా ఉంది. వాండరర్స్‌లో (2018) దక్షిణాఫ్రికాతో టీమ్‌ఇండియాకు జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో పిచ్ చాలా ప్రమాదకరంగా కనిపించింది. పుజారా తన పరుగుల ఖాతా ప్రారంభించడానికి ముందు ఏకంగా 53 బంతుల్ని ఎదుర్కొన్నాడు. అప్పుడు బంతులు చాలా ప్రమాదకరంగా అన్నివైపుల నుంచి దూసుకువచ్చాయి. అయినా పుజారా చాలా ఓపిగ్గా వాటిని ఎదుర్కొన్నాడు' అని అశ్విన్ అప్పటి విశేషాలను తన యూట్యూబ్ ఛానల్ వేదికగా గుర్తు చేసుకున్నాడు. 'విరాట్‌కోహ్లీ కవర్ డ్రైవ్, రోహిత్ శర్మ పుల్ షాట్, ధోనీ హెలికాప్టర్ షాట్ ఎంత ఫేమసో.. పుజారా డిఫెన్స్ కూడా అంతే. అతడు టెస్ట్ క్రికెట్‌లో ఎవరికంటే కూడా తక్కువ కాదు. విరాట్, రోహిత్‌కంటే కూడా తక్కువ కాదు' అని అశ్విన్ పుజారాను కొనియాడాడు. అశ్విన్ ప్రస్తావించిన మ్యాచ్ 2018లో జొహన్నెస్‌బర్గ్ వేదికగా దక్షిణాఫ్రికా, టీమ్‌ఇండి యా మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో పుజారా 179 బంతులు ఎదుర్కొని 50 పరుగులు చేశాడు. పుజారా సహకారంతో కోహ్లీ 106 బంతుల్లో 54 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో పుజారా తన తొలి పరుగు సాధించడం కోసం ఏకంగా 53 బంతుల్ని ఎదుర్కొన్నాడు. ఛతేశ్వర్ పుజారా 103 టెస్ట్ మ్యాచుల్లో 43.60 యావరేజ్‌తో 7,195 పరుగులు చేశాడు. ఇందులో 19 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలున్నాయి. 206లి టెస్టుల్లో అతడికి అత్యధిక వ్యక్తిగత స్కోర్.

## రోహిత్ శర్మను తప్పించడానికే బ్రాంకో టెస్ట్

### టీమ్ ఇండియా మాజీ క్రికెటర్



టీమ్‌ఇండియా ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను తేల్చేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న యోయో పరీక్షతో పాటు బ్రాంకో టెస్టునూ ఇకపై బీసీసీఐ ప్రవేశపెట్టనుంది. ఈ నిర్ణయంపై పలువురు మాజీల నుంచి మిశ్రమ స్పందనలు వచ్చాయి. అయితే టీమ్‌ఇండియా ఆటగాళ్లలో ఫిట్‌నెస్ ప్రమాణాలను పెంచడం కోసం స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ అడ్రియన్ లి రాక్స్ ఈ పరీక్షను జట్టుకు పరిచయం చేశాడు. అంటే ఇకపై ఓ ఆటగాడు పూర్తి ఫిట్‌గా ఉన్నాడని ధ్రువీకరించాలంటే అతడు యోయోతో పాటు బ్రాంకో టెస్టులోనూ పాసవ్వాల్సి ఉంటుంది. అయితే.. రోహిత్ శర్మను వన్డే జట్టు నుంచి తప్పించడానికే ఈ టెస్ట్‌ను ప్రవేశపెట్టారని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ తీవ్రమైన ఆరోపణలు చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ.. ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు తమ వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వీరిద్దరూ వన్డే ఫార్మాట్లోనే కొనసాగుతున్నారు. వీరు 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడదామనుకుంటున్నారు. అయితే రోహిత్ శర్మకు బ్రాంకో టెస్ట్ పాస్ కావడం కాస్త కష్టంతో కూడుకున్న పని అని మనోజ్ తివారీ ఓ ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డాడు. 'నా ఉద్దేశం ప్రకారం 2027 వరల్డ్ కప్ ప్రణాళిక నుంచి విరాట్ కోహ్లీని పక్కకు పెట్టడం అంత సులువు కాదు. కానీ వారు రోహిత్ శర్మను తప్పించాలనుకుంటున్నారు. ఇండియన్ క్రికెట్‌లో ఏం జరుగుతుందో నేను సునిశితంగా పరిశీలిస్తున్నా. రోహిత్ శర్మను భవిష్యత్తులో వన్డే జట్టు నుంచి దూరం చేయడం కోసమే ఇటీవల బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెట్టారు' అని మనోజ్ తివారీ ఆరోపించాడు. 'మీకు తెలుసా.. బ్రాంకో టెస్ట్ అత్యంత కఠినమైన ఫిట్‌నెస్ పరీక్షల్లో ఒకటి. అయితే ఈ టెస్ట్‌ను ఇప్పుడే ఎందుకు ప్రవేశపెట్టారనేదే ప్రశ్న. కొత్త హెడ్‌కోచ్ ఈ పరీక్షను మొదటి సిరీస్ నుంచే ఎందుకు అమలు చేయలేదు? అసలు ఇది ఎవరి ఆలోచన? దీన్ని ఎవరు ప్రవేశపెట్టారు? కొన్ని రోజుల క్రితం ఈ బ్రాంకో టెస్ట్‌ను ఎవరు అమలు చేశారు? ఇవి నా దగ్గర సమాధానాలు లేని ప్రశ్నలు. కానీ రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్‌పై మరింత దృష్టి పెట్టకపోతే.. ఈ టెస్ట్ పాసవడం అతడికి అంత తేలిక కాదు. ఈ బ్రాంకో టెస్ట్‌తో.. రోహిత్ శర్మను వన్డే జట్టు నుంచి తప్పిస్తారని నేను భావిస్తున్నా' అని మనోజ్ తివారీ వాపోయాడు. బ్రాంకో అంటే పరుగు పరీక్ష. ఎక్కువగా రగ్బీ ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను నిర్ణయించేందుకు ఉపయోగిస్తారు. దీని ద్వారా ప్లేయర్ల శారీరక సామర్థ్యం, వేగం, మానసిక దృఢత్వంపై ఓ అంచనాకు రావొచ్చు. ఈ పరీక్షలో ఒక ఆటగాడు విరామం లేకుండా ఆరు నిమిషాల వ్యవధిలో మొత్తంగా 1200 మీటర్ల దూరం పరుగెత్తాల్సి ఉంటుంది.

## ఆసియా కప్‌లో టీమ్‌ఇండియానే ఫేవరెట్

### శ్రీలంక మాజీ క్రికెటర్



ఆసియా కప్‌లో టీమ్‌ఇండియానే ఫేవరెట్ అని శ్రీలంక మాజీ క్రికెటర్ ఫర్వేజ్ మహరూఫ్ అంటున్నాడు. అదే సమయంలో టీ20ల్లో ఏమైనా జరగొచ్చని, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు కూడా గెలిచే అవకాశం ఉందని అతడు చెబుతున్నాడు. ఇప్పటివరకు శ్రీలంక మొత్తం ఆరుసార్లు ఆసియా కప్‌ను సొంతం చేసుకుంది. అలాగే బంగ్లాదేశ్ 2012, 2016, 2018లో ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ విజేతగా నిలవలేకపోయింది. 'టీమ్‌ఇండియానే ఆసియాకప్ టైటిల్ ఫేవరెట్. కానీ.. శ్రీలంక, బంగ్లాదేశ్‌లు అందరినీ విస్మయానికి గురిచేస్తూ గెలిచే అవకాశమూ ఉంది. టీమ్‌ఇండియా స్క్వాడ్ బలంగా ఉంది. కానీ ఇది టీ20 క్రికెట్. ఇక్కడ ఏదైనా జరగొచ్చు. ఎవరైనా ఛాంపియన్లుగా అవతరించొచ్చు' అని మహరూఫ్ ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. అలాగే భారతజట్టు బలాల గురించి కూడా అతడు విశ్లేషించాడు. 'అన్ని ఫార్మాట్లలోనూ భారత్‌కు చాలామంది ఆటగాళ్లు ఉన్నారు. రోహిత్ శర్మ టీ20ల నుంచి రిటైర్ అయ్యాడు. అతడి స్థానాన్ని భర్తీ చేయడానికి చాలామంది క్రికెటర్లు ఉన్నారు. ముఖ్యంగా ఐపీఎల్ వల్ల టీమ్‌ఇండియాకు ఎంతో మేలు జరుగుతోంది' అని మహరూఫ్ అన్నాడు. యశస్వి జైస్వాల్ గురించి కూడా మహరూఫ్ మాట్లాడాడు. 'యశస్వి జైస్వాల్ బ్యాటింగ్‌ను నేను ఆస్వాదిస్తా. అతడో యువ క్రికెటర్. జైస్వాల్ ఎప్పుడైతే పెద్ద స్కోర్లు చేస్తాడో.. అప్పుడు కచ్చితంగా టీమ్ ఇండియా విజయం సాధిస్తుంది. కానీ దురదృష్టవశాత్తూ అతడు ప్రస్తుతం టీమ్‌ఇండియా స్క్వాడ్‌లో లేడు. అయినా జైస్వాల్ త్వరలోనే టీ20 జట్టులోనూ తన స్థానాన్ని సంపాదించు కుంటాడు' అని ఫర్వేజ్ మహరూఫ్ అన్నాడు. అలాగే జస్‌ప్రీత్ బుమ్రా గాయాల గురించి కూడా అతడు వివరించాడు. 'బుమ్రా బౌలింగ్ యాక్షన్ యూనిక్. అతడు గతానికి ఇప్పటికీ ఎంతో మెరుగయ్యాడు. బంతిని ఇన్‌స్వింగ్, అవుట్ స్వింగ్ కూడా చేయగలుగుతున్నాడు. ఇప్పుడు ఉన్న బౌలర్లలో ఎవరు అత్యంత కఠినమైన బౌలర్ అని బ్యాటర్లను అడిగితే.. వారితో 90 శాతం మంది బుమ్రానే అని చెబుతారు. అయితే దురదృష్టవశాత్తూ అతడు తరచూ గాయాలపాలవుతున్నాడు. అతడి వర్క్‌లోడ్‌ను బీసీసీఐ దృష్టిలోపెట్టుకొని జాగ్రత్తగా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఫాస్ట్ బౌలర్లు బంతిని సంధించిన ప్రతిసారీ తమ శరీర బరువుకు మూడురెట్ల భారాన్ని వారి వెన్ను, మోకాళ్లు, మడమల మీద మోపినట్లవుతుంది. అందుకే ఎక్కువగా గాయాలపాలయ్యే అవకాశం ఉంటుంది' అని మహరూఫ్ వివరించాడు. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్ అఫ్గానిస్థాన్, హాంకాంగ్‌ల మధ్య జరగనుంది. సెప్టెంబర్ 10న టీమ్‌ఇండియా, యూఏఈ తలపడనున్నాయి.

## బుమ్రా జట్టులో లేనప్పుడే.. ఎందుకు బాగా ఆడతానంటే.. : మహ్మద్ సిరాజ్



టీమ్‌ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్ ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్ టూర్‌లో తన సత్తా చాటాడు. అయిదు టెస్టుల్లో ఏకంగా 23 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అలాగే రెండు సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు. ముఖ్యంగా ఆఖరి టెస్టులో టీమ్‌ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో భారతజట్టు ఈ సిరీస్‌ను 2-2తో సమం చేసుకుంది. వర్క్‌లోడ్ నేపథ్యంలో జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడగలిగాడు. అతడి గైర్హాజరీలో పేస్ దళాన్ని సిరాజ్ ముందుండి నడిపించాడు. బుమ్రా జట్టులో లేనప్పుడు తాను మరింత మెరుగ్గా రాణించడానికి గల కారణాన్ని అతడు ఓ ఇంటర్వ్యూలో వివరించాడు. 'బాధ్యతను మోయడానికి నాకు అవకాశం వచ్చినప్పుడు.. నేను ఒక సాధారణ సిరీస్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేస్తాను. బాధ్యత నాలో ఆనందాన్ని రేకెత్తిస్తుంది. ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతుంది. జస్‌ప్రీత్ బుమ్రా వెన్ను గాయం కారణంగా కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో లేడు. అలాగే అతడి వర్క్‌లోడ్ నేపథ్యంలో బౌలింగ్ యూనిట్‌లో సానుకూల వాతావరణాన్ని కొనసాగించడానికి నావంతు ప్రయత్నం చేస్తున్నాను. నేను నా సహచరులు, ఆకాశ్ దీప్ ఇతర బౌలర్లతో మాట్లాడుతున్నప్పుడు.. మనం దీన్ని సాధించగలమనే నమ్మకాన్ని వారిలో కలిగించేందుకు కృషి చేశా. మనం ఇప్పటికే సాధించిన వాటిని మళ్లీ చేసి చూపించవచ్చని వారితో చెప్పాను' అని సిరాజ్ వివరించాడు. మహ్మద్ సిరాజ్ ఇప్పటి వరకు టీమ్‌ఇండియా తరఫున 41 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. 31.1 యావరేజ్‌తో 123 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. 5 సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అలాగే 44 వన్డేల్లో 24 యావరేజ్‌తో 32 వికెట్లు తీసుకున్నాడు. ఒక్కసారి అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు. 16 టీ20ల్లో 32.3 యావరేజ్‌తో 14 వికెట్లు పడగొట్టాడు. ఇంకా 108 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ 30.7 యావరేజ్‌తో 109 వికెట్లు కూల్చాడు.

## తెర వెనక ఏం జరిగిందో విరాట్ కోహ్లీ ఎప్పటికీ చెప్పకపోవచ్చు



టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌కు ముందు మే 12, 2025లో సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. నిజానికి అతడు ఇంగ్లాండ్ టూర్‌లో ఆడదామనే ఉద్దేశంతోనే రంజీ మ్యాచుల్లో కూడా పాల్గొన్నాడు. కానీ అకస్మాత్తుగా అతడు టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే అసలు కారణం ఏంటో.. విరాట్ కోహ్లీ ఎప్పటికీ చెప్పకపోవచ్చని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అన్నాడు. 'నిజానికి తెర వెనక ఏం జరిగిందో నాకైతే తెలియదు. ఆ విషయం విరాట్‌కే తెలుసు. కానీ అతడు ఆ విషయాన్ని ఎప్పటికీ బహిర్గతం చేయకపోవచ్చు. నాకు తెలిసి భగవంతుడు తనకు ఇచ్చిన దాంతో అతడు ఆనందంగా ఉన్నాడు. అలాగే కోహ్లీ ఆధ్యాత్మిక మార్గంలో కూడా పయనిస్తున్నాడు. ఎవరైతే ధార్మిక చింతనను అలవర్చుకుంటారో.. వారు ఏ విషయాన్నీ పెద్దగా పట్టించుకోరు. వర్తమానం మీదే ఎక్కువగా దృష్టిపెడతారు. వారు గతం గురించి కూడా మాట్లాడటానికి ఇష్టపడరు' అని మనోజ్ తివారీ విశ్లేషించాడు. 'విరాట్ కోహ్లీ మరో మూడు నుంచి నాలుగు సంవత్సరాల వరకు టెస్ట్ క్రికెట్ ఆడగలడు. నాతో సహా, ఫ్యాన్స్ అందరినీ అతడి రిటైర్మెంట్ నిర్ణయం షాక్‌కు గురిచేసింది. విరాట్ ఫిట్‌నెస్ గురించి మనందరికీ తెలుసు. అలాగే అతడు ఇంగ్లాండ్ సిరీస్ కోసం సన్నద్ధం అయ్యాడు. అయితే అసలు ఏం జరిగిందనే విషయం క్రికెట్ విశ్లేషకులకు కొంత తెలిసి ఉంటుంది. తన చుట్టూ ఉన్న వాతావరణం విరాట్‌కు నచ్చి ఉండకపోవచ్చు' అని మనోజ్ తివారీ పేర్కొన్నాడు.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# జీ స్టూడియోకు చిరు చిత్రం డిజిటల్ రైట్స్

అనిల్ రావిపూడి చివరిగా చేసిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏకంగా 300 కోట్లు కలెక్ట్ చేసి, ఫ్యామిలీ సినిమా సత్తా ఏంటో చాటింది. నాన్ థియేటర్ హక్కులను జీ స్టూడియోస్ సంస్థ భారీగానే దక్కించుకొని, గట్టిగానే లాభపడింది. ఇక ఇప్పుడు చిరంజీవిఅనిల్ రావిపూడి సినిమా విషయంలో కూడా హక్కులు జీ స్టూడియోస్ దక్కించుకున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమాకు మన శంకర వరప్రసాద్ గారు పండగకి వస్తున్నారు అనే టైటిల్‌ను అనిల్ రావిపూడి ఫిక్స్ చేశాడు. జీ స్టూడియోస్ సంస్థ డిజిటల్ రైట్స్‌తో పాటు శాటిలైట్ రైట్స్‌ను కూడా ఫ్యాన్సీ ప్రైస్‌కి దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. దాదాపుగా డీల్ క్లోజ్ అయినట్లేనని, చిరంజీవిఅనిల్ రావిపూడి కెరీర్‌లోనే అత్యధిక డబ్బులు రాబట్టిన ఓటీటీ డీల్‌గా ఇది నిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది.ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, జీ స్టూడియోస్ సంస్థ ఈ సినిమాకు సంబంధించిన హిందీ డిజిటల్ రైట్స్‌ను అమెజాన్ ప్రైమ్‌కు అమ్మేసింది. అయితే, సౌత్ శాటిలైట్, డిజిటల్ రైట్స్‌ను మాత్రం తన దగ్గరే ఉంచుకుంది. నిజానికి, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ సంస్థలు ఈ సినిమా రైట్స్ దక్కించుకునే ప్రయత్నం చేశాయి. అయితే, అనిల్ రావిపూడితో ప్రస్తుతం షోస్ కూడా చేస్తున్న జీ స్టూడియోస్ సంస్థ ఫైనల్‌గా డీల్ క్రాక్ చేసింది. ఇప్పటికే ఇండస్ట్రీ సమ్మె పూర్తికావడంతో, సెప్టెంబర్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ సినిమాను వచ్చే సంక్రాంతికి బరిలోకి దించబోతున్నారు. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు బీమ్స్ సంగీతం అందిస్తున్నాడు.

# మిరాయ్ సినిమా మరో వారం వాయిదా

హనుమాన్ సినిమాతో ఫ్యాన్ ఇండియా క్రేజ్ సంపాదించుకున్న తేజా, ఇప్పుడు మిరాయ్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై విశ్వప్రసాద్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. నిజానికి, ఈ సినిమా సెప్టెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది, కానీ ఈ సినిమా ఒక వారం వాయిదా పడే అవకాశం ఉందని అంటున్నారు. ఇంకా అధికారిక సమాచారం రాలేదు, కానీ సెప్టెంబర్ 12వ తేదీన సినిమా రిలీజ్ చేయబోతున్నారు. ఈ విషయాన్ని 28వ తేదీన రిలీజ్ చేయబోతున్న ట్రైలర్‌తో పాటు ప్రకటించనున్నారు. ఈ సినిమా పూర్తిగా కంప్యూటర్ గ్రాఫిక్స్ బేస్డ్ సినిమా. సినిమాలో సింహభాగం కంప్యూటర్ గ్రాఫిక్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఈ సినిమా కంప్యూటర్ గ్రాఫిక్స్ అవుట్‌పుట్ సెప్టెంబర్ 1వ తేదీ నాటికి రెడీ అవుతుందని అంచనా వేసినప్పటికీ, ఒకవేళ వాటిలో ఏమైనా కరెక్షన్స్ చేయాల్సి వస్తే, అప్పటికప్పుడు చేసి 5వ తేదీ లోపు రిలీజ్ చేయడం కష్టం కాబట్టి, కాస్త సమయం తీసుకునేందుకు సెప్టెంబర్ 12వ తేదీన ఫిక్స్ చేసుకున్నట్లు సమాచారం.




# యధావిధిగా 5న విడుదలవుతున్న ఘాటి

క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క, విక్రమ్ ప్రభు కీలక పాత్రల్లో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ డ్రామా ఘాటీ. సెప్టెంబరు 5న ఈ మూవీ విడుదల కానుంది. ఇదే రోజున రావాల్సిన మిరాయ్ వాయిదా పడటం అనుష్క సినిమాకు కలిసొచ్చే అంశం. ఎక్కువ థియేటర్లు దొరికే అవకాశం ఉంది. అదే సమయంలో తమిళం నుంచి వస్తున్న శివకార్తికేయన్ మదరాశి పైనా మంచి అంచనాలే ఉన్నాయి. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రస్తుతం ఈ సినిమాలకే కాదు, దసరా కానుకగా రాబోతున్న చిత్రాల పైనా సమ్మె ప్రభావం పడినట్లు తెలుస్తోంది. పవన్‌కల్యాణ్ కథానాయకుడి సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా ఓజీ. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీని సెప్టెంబరు 25న విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల ఈ సినిమా విడుదల తేదీ విషయంలో కాస్త గందరగోళం నెలకొంది. ఇంకో నాలుగైదు రోజుల షూటింగ్, అది కూడా ప్యాచ్ వర్క్ మిగిలిఉందని టాక్ వినిపించింది. ఈక్రమంలో సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉందన్నారు. కానీ, సువ్వి.. సువ్వి సాంగ్ ప్రకటిస్తూ విడుదల తేదీలో ఎలాంటి మార్పూ లేదని చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇంకా నెల రోజులే సమయం ఉండటంతో వీలైనంత త్వరగా ప్రమోషన్స్ మొదలు పెట్టాలని పవన్ అభిమానులు కోరుతున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న అఖండ2: తాండవం కూడా సెప్టెంబరు 25నే విడుదల కావాల్సిఉంది. ఈ విషయాన్ని కూడా చిత్ర బృందం ప్రకటించింది. ఇటీవల చోటుచేసుకున్న పరిస్థితుల వల్ల విడుదల తేదీపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దసరా సీజన్ తప్పితే, అఖండ వచ్చిన డిసెంబరులోనే అఖండ2 కూడా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే బాలకృష్ణ డబ్బింగ్ కూడా పూర్తి చేశారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉందని టాక్.

# సుందరకాండ.. నేడు గ్రాండ్ రిలీజ్

నారా రోహిత్ నటించిన సుందరకాండ చిత్రం 2025 ఆగస్ట్ 27న వినాయక చవితి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల అవుతుంది. వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రెండు ప్రేమకథలు ఉంటాయని తెలుస్తోంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు యు/ఎ సర్టిఫికేట్ ఇచ్చింది. ప్రధాన నటీనటులు నారా రోహిత్, వృతి వాఘాని, శ్రీదేవి విజయ్‌కుమార్. దర్శకత్వం వెంకటేష్ నిమ్మలపూడి నిర్మాతలు సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి సంగీతం లియోన్ జేమ్స్.ఈ సినిమా మధ్య వయస్కుడి ప్రేమకథ,ఇందులో రెండు ప్రేమకథలు ఉంటాయి.










# వెంకటేశ్‌తో వివి వినాయక్ మరో సినిమా!

టాలీవుడ్ సీనియర్ హీరో వెంకటేష్, తన తదుపరి సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో వచ్చిన విజయాన్ని కొనసాగించాలని భావిస్తున్న వెంకీ, ఎంతో ఆలోచించి తన తదుపరి ప్రాజెక్ట్‌ను మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో చేస్తున్నాడు. వెంకటేష్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందబోతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఇప్పటికే ప్రారంభమైంది. సెప్టెంబర్ నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ చేస్తున్న తొలి సినిమా ఇదే కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇకపోతే త్రివిక్రమ్ సినిమా మాత్రమే కాకుండా, వెంకటేష్ ప్రస్తుతం ఇతర దర్శకులతో కూడా చర్చలు జరుపు తున్నారు. కొత్త కథలు వింటూ, తదుపరి ప్రాజెక్టుల కోసం పునరాలోచన చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతోంది. గతంలో వెంకటేష్‌తో లక్ష్మి అనే బ్లాక్‌బస్టర్ సినిమాను తెరకెక్కించిన వి.వి. వినాయక్, మళ్లీ వెంకీ కోసం ఓ మాస్ ఎంటర్‌టైనర్ స్క్రిప్ట్ రాయిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే ఆయన వెంకటేష్‌ను కలవాలని, కథ చెప్పాలని చూస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్. 2006లో వచ్చిన లక్ష్మి చిత్రం వెంకటేష్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచింది. అప్పట్లో వీరిద్దరి కాంబినేషన్ మరోసారి రిపీట్ కానుందని వార్తలు వచ్చినా, ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. ఇప్పుడు 19 ఏళ్ల గ్యాప్ తర్వాత, మళ్లీ అదే కాంబినేషన్ తెరపైకి వస్తుందన్న వార్తలు అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. పైగా ఇది కూడా మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ జానర్‌లో ఉండనున్నట్టు సమాచారం. ఇంటెలిజెంట్ వంటి సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచిన తర్వాత వినాయక్ కొంతకాలం గ్యాప్ తీసుకున్నారు. హిందీలో ఛత్రపతి రీమేక్ చేసినా, అది కూడా మిశ్రమ స్పందనే పొందింది. దాంతో కాస్త గ్యాప్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వెంకటేష్‌తో కాంబినేషన్ కుదిరితే, వినాయక్ తిరిగి హిట్ ట్రాక్‌లోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# నిర్మాణ రంగంలోకి జయం రవి



ఒకవైపు మాజీ భార్య ఆర్తితో విడాకుల వివాదంతో వార్తల్లో నిలుస్తునే.. మరోవైపు తన కెరీర్‌లో కీలక ముందడుగు వేశాడు నటుడు జయం రవి (రవి మోహన్). తాజాగా ఈ నటుడు రవిమోహన్ స్టూడియోస్ పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించాడు. చెన్నైలో ఈ వేడుక ఘనంగా జరుగగా.. ఈ ఈవెంట్‌కి రవి తన ప్రేయాసి కెన్నిషాతో కలిసి వచ్చి ఘనంగా ప్రారంభించారు. ఇక ఈ వేడుకకు.. ముఖ్య అతిథులుగా కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, తమిళ హీరోలు కార్తీతో పాటు, శివకార్తికేయన్ సూర్య, అథర్వ, జెనీలియా, రితేష్ దేశ్‌ముఖ్, దర్శకురాలు సుధా కొంగరతో పాటు పలువురు స్టార్ సెలబ్రీటిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవి మోహన్ స్టూడియోస్ బ్యానర్ లో నిర్మించబోయే తొలి రెండు సినిమాలను కూడా ప్రకటించారు. అందులో మొదటి సినిమాలో రవి మోహన్ హీరోగా కార్తీక్ యోగి దర్శకత్వంలో తెరకెక్కబోతుంది. సూర్య ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనున్నాడు. ఇక రెండవ సినిమాలో హాస్య నటుడు యోగిబాబు లీడ్ లో రాబోతోంది. ఈ సినిమాను స్వయంగా రవి మోహన్ దర్శకత్వం వహించబోతున్నాడు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com